



సిద్ధి వినాయక..

అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి వారు

సొమ్ములివ్వరూ..



బండారులంక చేనేత సహకార సంఘం

- ఆప్కో బకాయిలు విడుదల కాక సహకార సంఘాలు విలవిల
- జిల్లాలో చేనేత సంఘాలకు రూ.6 కోట్ల పైబడి బకాయిలు
- బకాయిల కోసం సంఘాల నిరీక్షణ
- లివరీ సంఘాలకు రూ.2.50 కోట్లు పైబడి బకాయిలు

అమలాపురం రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చేనేత మాతృసంస్థ ఆప్కో. చేనేత సహకార సంఘాల నుంచి ఎప్పటికప్పుడు వస్త్ర నిల్వలను ఆప్కో కొనుగోలు చేస్తుంటుంది. సంఘాలకు నూలును సరఫరా చేస్తుంది. కానీ నెలల గడచిపోతున్నా సొమ్ములు మాత్రం ఆప్కో చెల్లించడం లేదు. జిల్లాలోని చేనేత సహకార సంఘాలు ఆప్కో వ్యాపారానికి మాత్రం ఉపయోగపడుతున్నాయి. కొనుగోలు చేసిన సరుకుకు సొమ్ములు చెల్లించకపోవడంతో కార్మికులకు పనులు కల్పించలేని దుస్థితి సంఘాలకు ఏర్పడింది. కనీసం బకాయిల విడుదల కోసం అడిగేందుకు సంఘాలకు పాలకవర్గాలు కూడా లేవు. అధికారుల ఏలుబడిలోనే సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. కోనసీమ జిల్లాలో 23 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. అయితే జిల్లాలోని 19 చేనేత సహకార సంఘాల నుంచి ఆప్కో కొనుగోలు చేసిన వస్త్ర ఉత్పత్తులకు రూ.6 కోట్లుపైబడి బకాయిలు విడుదల చేయాల్సి ఉంది. బకాయిలు విడుదలకాక సంఘాలు విలవిల్లాడిపోతున్నాయి.

బకాయిల విడుదల ఎప్పుడో..

కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రపురం నియోజకవర్గంలోని చేనేత సహకార సంఘాలకు ఆప్కో సంస్థ రూ.2.50 కోట్ల మేర సంఘాలకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. సంక్షేమ శాఖలకు ప్రభుత్వం సరఫరా చేసే దుప్పట్లు, బెడ్‌షీట్లు వంటి లివరీ ఉత్పత్తుల్లో అగ్రభాగం ఉమ్మడి జిల్లాలోని రామచంద్రపురం నియోజకవర్గంలోనే ఉంది. దాంతో ప్రభుత్వ అవసరాలకు ఆప్కో సంస్థ భారీగా వస్త్ర నిల్వలను ఆయా సంఘాల నుంచి కొనుగోలు చేస్తుంది. ఈ నెలాఖరు నాటికి ఆప్కో సంస్థ జిల్లాలోని 19 సంఘాలకు రూ.6 కోట్లు పైబడి బకాయిలు చెల్లించాల్సి ఉంది. సంఘాలకు అవసరమైన నూలును కూడా సరఫరా చేయడం ఆప్కో నిలిపివేసింది. రామచంద్రపురం నియోజకవర్గంలోని ప్రధానమైన నాలుగు చేనేత సహకార సంఘాలకు సుమారు రూ.2.50 కోట్ల మేర బకాయిలను ఆప్కో చెల్లించాల్సి ఉంది. ప్రధానంగా ఆ నియోజకవర్గంలోని హసన్‌బాద సొసైటీకి అధికారిక లెక్కల ప్రకారం జూలై నెలాఖరు నాటికి ఆప్కో రూ.86,18,785, ఆదివారపుపేట సొసైటీకి రూ.32,67,815, అద్దంపల్లి సొసైటీకి రూ.26లక్షలు, శివల సొసైటీకి రూ.58,16,863 బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈనెలలో మళ్లీ లివరీ ఉత్పత్తులను ఆప్కో సంస్థ భారీగా కొనుగోలు చేసింది. దాంతో సంఘాలు నిధులు విడుదల కాక, నూలు సరఫరా లేక విలవిల్లాడిపోతున్నాయి. కార్మికులకు పనులు కల్పించలేని పరిస్థితి. జూలై నెలాఖరు నాటికి చేనేత జౌళిశాఖ అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలోని 19 సంఘాలకు రూ.4,81,03,902 బకాయిలు చెల్లించాల్సి ఉంది. అత్యధికంగా అంగర చేనేత సహకార సంఘానికి జూలై నాటికి రూ.98 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆ తరువాత ఇప్పటివరకు హసన్‌బాద సొసైటీకి రూ.1.10 కోట్ల మేర బకాయిలు విడుదల కావాల్సి ఉంది. అత్యల్పంగా బండారులంక, విలసవిల్లి, రంగాపురం, మండపేట సొసైటీలకు వేలల్లో మాత్రమే ఆప్కో బకాయిలు చెల్లించాల్సి ఉంది.

త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల కాక..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని చేనేత సహకార సంఘాల సభ్యులకు త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద రూ.55 లక్షలు విడుదల కావాల్సి ఉంది. ఇప్పటికే ఆయా సభ్యుల ఖాతాల్లోకి జమచేసే విధంగా చేనేత జౌళిశాఖ, జిల్లాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ప్రథమార్థం నుంచి ఆ నిధులు మాత్రం సీఎఫ్ఎంఎస్ నుంచి విడుదల కాక సభ్యులకు చేరడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆప్కో బకాయిలతోపాటు త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల చేసి సంఘాలతోపాటు కార్మికులను ఆదుకోవాలని కోరుతున్నారు.



పి.గన్నవరం మండలం చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేపై రాకపోకలు సాగిస్తున్న స్థానికులు

గోదావరిని మళ్లీ ముంచెత్తిన వరద

ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ.. లంకలు, కాజ్‌వేలు మునక

నిమజ్జనాలపై తీరప్రాంత అధికారులు అప్రమత్తం.. వరదపై డీఆర్వో మాధవి సమీక్ష

అమలాపురం, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): గోదావరిని మరోసారి వరదలు ముంచెత్తాయి. జిల్లాలో పక్షం రోజుల వ్యవధిలో గోదావరికి వరద మరోసారి పోటెత్తడంతో గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమి నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శనివారం రాత్రి 8.35 గంటలకు నీటిమట్టం 11.75 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. రాత్రి 10 గంటలకు నీటిమట్టం 11.90 అడుగులకు చేరగా, 10,06,819 క్యూసెక్కుల వరద సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దాంతో ఆ నీరు కోనసీమ జిల్లాలోని నాలుగు నదీపాయలలోకి చేరుతోంది. లంక గ్రామాలు క్రమంగా వరద దిగ్బంధానికి గురవుతున్నాయి. కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాలను కలిపే కనకాయకలంక కాజ్‌వే మునగడంతో ప్రజలు పడవలపై ప్రయాణం చేస్తున్నారు. దొడ్డిపట్ల రేవులో రాకపోకలు నిషేధించారు. అప్పనపల్లి, ముక్తేశ్వరం ఎదురుబిడియం కాజ్‌వేలపై వరదనీరు చేరుతోంది. పి.గన్నవరం మండలం జి.పెదపూడిలంకలో నాలుగు గ్రామాల ప్రజలు రవాణా సౌకర్యాలు స్తంభించడంతో లైఫ్‌జాకెట్ల సాయంతో రాకపోకలు సాగిస్తున్నారు. కొత్తపేట, అయినవిల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల పరిధిలోని నదీతీర లంక గ్రామాల్లోకి వరద చేరుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇన్‌చార్జ్ డీఆర్వో కె.మాధవి ముమ్మిడివరం వరద ప్రాంతాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. నదీతీర ప్రాంతాల్లో గణేష్ నిమజ్జనాలు చేస్తున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తమయ్యారు. కోటిపల్లి రేవులో నిమజ్జన ప్రాంతాన్ని ఆర్డీవో అఖిల, డీఎస్పీలు, కొత్తపేటలో ఆర్డీవో శ్రీకర్ నిమజ్జన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

నిర్మాణ రంగాల డిమాండ్ మేరకు ఇసుక సరఫరా : కలెక్టర్

అమలాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్మాణరంగాలకు డిమాండ్ మేరకు స్టాక్ యార్డుల ద్వారా ఇసుకను సరఫరా చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులతో సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేని స్టాకు పాయింట్ల వద్ద ఇసుకను స్వాధీనం చేసుకోవాలన్నారు. కపిలేశ్వరపురం ఇసుక రీచ్ వద్ద 55వేల మెట్రిక్ టన్నులు, అమలాపురంలో 2,360 మెట్రిక్ టన్నులు, పి.గన్నవరంలో 436 మెట్రిక్ టన్నులు స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనపరచుకున్న ఇసుకను టన్నుకు నిర్దేశించిన ఖర్చును రాబడుతూ సరఫరా చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో రిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరా జరగాలన్నారు. జిల్లావ్యాప్తంగా 10వేల మెట్రిక్ టన్నుల వరకు నిర్మాణ రంగాలకు రోజువారీగా డిమాండ్ ఉందని, ఆ మేరకు ఇసుక సరఫరా చేయాలన్నారు. మండల, డివిజన్ స్థాయిల్లో నియమించిన టాస్క్‌ఫోర్స్ టీములు పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తూ పారదర్శకంగా ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్‌హియరింగ్, సీఆర్‌జడ్ పర్యావరణ అనుమతులు వంటి అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. డీఆర్వో కె.మాధవి, ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, డీపీవో డి.శాంతలక్ష్మి, భూగర్భ గనులశాఖ ఏడీ ఎల్.వంశీధర్‌రెడ్డి, జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆకస్మిక బదిలీ

బార్ పాలసీ అమలులో వైఫల్యమే కారణమంటూ ప్రచారం



అమలాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్సైజ్ నూతన బార్ పాలసీ అమలు చేయడంలో వైఫల్యం చెందారన్న అభియోగాలపై జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్‌పై ప్రభుత్వం బదిలీ వేటువేసింది. శనివారం ఆయన్ను బదిలీ చేస్తూ ఆదేశాలు వెలువడినట్టు సమాచారం. ప్రసాద్‌ను విజయవాడలోని ఎక్సైజ్ కమిషనరేట్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించినట్టు సమాచారం. జిల్లాలో ఎక్సైజ్ మద్యం బార్ పాలసీ అమలులో భాగంగా తొమ్మిది బార్‌లకు, రెండు గీత కార్మికుల పేరిట బార్‌లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. అయితే కేవలం అమలాపురం మున్సిపాలిటీలో ఒకేఒక వ్యక్తి తన దరఖాస్తుతోపాటు నిబంధనలు అనుసరించి మరో మూడు దరఖాస్తులను దాఖలు చేయడంతో ఆయనకు బార్ లైసెన్సు శనివారం డీఆర్వో మాధవి, సూపరింటెండెంట్ ప్రసాద్ చేతులమీదుగా అందించిన కొన్ని గంటల్లోనే బదిలీ వేటు పడింది. బార్ పాలసీ అమలులో భాగంగా నిర్వాహకులను ఒప్పించడంలో వైఫల్యం చెందారనే అభియోగంతోపాటు ఇటీవల నియోజకవర్గంలో మద్యం వ్యాపారులు ఎక్సైజ్ అధికారుల వైఖరికి నిరసనగా తాళాలువేసి షాపులు మూసివేయడం మరో కారణం. అలాగే అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో అక్రమ మద్యం తయారీ రాకెట్‌పై ఉక్కుపాదం మోపడంలో ఎక్సైజ్‌శాఖ అధికారుల వైఫల్యాలు కూడా ప్రసాద్ బదిలీకి మరో కారణంగా భావిస్తున్నారు.



జిల్లాలో బార్ లైసెన్సు పొందిన శరత్‌కు లైసెన్సు అందజేస్తున్న డీఆర్వో మాధవి

జిల్లాలో బార్ లైసెన్సు పొందిన ఒకేఒక్కడు!

అమలాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్ లైసెన్సు పొందిన ఏకైక వ్యక్తిగా అమలాపురం పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు అల్లాడ శరత్‌బాబు నిలిచారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని తొమ్మిది బార్‌లతోపాటు కల్లుగీత కార్మికులకు ప్రత్యేకంగా కేటాయించిన రెండు బార్‌లతో కలిపి మొత్తం 11 బార్‌లకు నోటిఫికేషన్ జారీచేశారు. గడువు ముగిసే సరికి అమలాపురంలోని ఒక బార్‌కు నిబంధనల మేరకు నాలుగు దరఖాస్తులు వచ్చాయి. ఆ బార్‌కు దరఖాస్తు చేసిన శరత్‌బాబు (స్వప్న బార్)ను లక్కీడిప్ ద్వారా ఎంపికచేసి శనివారం ఉదయం కలెక్టరేట్‌లో బార్ లైసెన్సును జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి అందజేశారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అవకాశం

అమలాపురం రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో ఆదివారం కూడా విద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు పనిచేస్తాయని ఏపీ ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాజేశ్వరి తెలిపారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులను చెల్లించాలని కోరారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతోపాటు ఏపీఈపీడీసీఎస్, సెక్షన్ ఆఫీస్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలోనూ ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు.

ఆదివారం ప్రత్యేకం



పాపికొండలకు హెలీ టూరిజం

- టెండర్లు ఆహ్వానించిన ఏపీటీడీసీ
- హెలీకాప్టర్ నుంచి గోదావరి వీక్షణ
- రాజమండ్రి టూ పాపికొండలు
- బోట్లో వెళ్లి రావాలంటే పది గంటలు
- విమానంలో అయితే అరగంటే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

చుట్టూ పచ్చని కొండలు.. ఆ కొండల మధ్య నుంచి వయ్యారాలు పోతూ సాగిపోయే గోదావరి.. మధ్యలో ఇసుక తిన్నెలు.. ఆ పక్కనే ప్రకృతి ప్రేమికుల మనసు దోచే అడవులు..ఇలా ఒకటేంటి పాపికొండల నడుమ గోదావరి అందాల గురించి వర్ణించాలంటే మాటలు చాలవు. అయితే వీటిని ఇప్పటి వరకు బోట్ల ద్వారా మాత్రమే వీక్షించి తన్మయం పొందే పర్యాటకులకు త్వరలో ఆకాశం నుంచి సైతం చూసే వీలుగా పర్యాటకశాఖ సన్నాహాలు చేస్తోంది. హెలీ టూరిజంలో భాగంగా హెలీకాప్టర్‌లో పర్యాటకులను తీసుకెళ్లి తీసుకువచ్చేలా కొత్తగా ప్రతిపాదనలు తయారుచేసింది. ఈ మేరకు హెలీటూరిజం.. జాయ్ రైడ్ పేరుతో టెండర్లు పిలిచింది. ఆసక్తిగల సంస్థలు రాజమహేంద్రవరం నుంచి పాపికొండలకు హెలీకాప్టర్‌లో పర్యాటకులను తీసుకెళ్లి తీసుకువచ్చేలా ముందుకు రావాలని కోరింది. ఇది గనుక నెరవేరితే త్వరలోనే పాపికొండలను ఎంచక్కా హెలీకాప్టర్‌లో తక్కువ సమయంలో చుట్టి వచ్చేయవచ్చు. ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి పాపికొండలకు వెళ్లి రావాలంటే పది గంటల వరకు సమయం పడుతోంది. కానీ అరగంట వ్యవధిలోనే ఇలా వెళ్లి వచ్చేయవచ్చు.

టెండర్లు ఆహ్వానం

రాజమహేంద్రవరం నుంచి పాపికొండల వరకు పర్యాటకుల రద్దీ ఆధారంగా హెలీకాప్టర్ సర్వీసును అందుబాటులో తేవాలని నిర్ణయించింది. తాజాగా హెలీటూరిజం కింద టెండర్లు పిలిచింది. సెప్టెంబరు నాలుగో తేదీలోగా తమ ఆసక్తిని వ్యక్తీకరిస్తూ దరఖాస్తు చేసుకోవాలని ఏవియేషన్ కంపెనీలను కోరింది. పాపికొండలతోపాటు అరకులోనూ ఈ సేవలను ప్రారంభించాలని భావిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీకాకుళంలో ఈ సేవలను అధికారులు ప్రారంభించారు. పాపికొండలకు హెలీ టూరిజం సేవలు ప్రారంభిస్తే రద్దీ భారీగా ఉంటుందని ఇప్పటికే పర్యాటకశాఖ అంచనాకు వచ్చింది. ప్రస్తుతం బోట్లలో పాపికొండలకు వెళ్లి రావడానికి పది గంటల వరకు సమయం పడుతోంది. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులకు ఒక రోజు వృథా అవుతోంది. అంతేకాకుండా నీటిలో ప్రయాణం అంటే భయపడేవారు అధికం. గతంలో జరిగాన్ని ప్రమాదాన్ని తలచుకుని పాపికొండల ప్రయాణం మానుకున్నవారెందరో. హెలీ టూరిజం సేవలు అందుబాటులోకి వస్తే అర గంటలోగా పాపికొండలు చుట్టి వచ్చేయవచ్చు. పాపికొండలకు బోట్లు ఆయా తరగతిని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.2,500 వరకు వసూలు చేస్తున్నాయి. హెలీకాప్టర్‌కు ఎంత వసూలు చేస్తారనేది ఎంపికైన కంపెనీతో చర్చించి నిర్ణయించనున్నారు. ఇదిలా ఉంటే 2027 జూలై నుంచి గోదావరి పుష్కరాలు మొదలుకానున్నాయి. దీనికి లక్షలాది మంది భక్తులు రానున్నారు. ఈలోగా హెలీ టూరిజం ప్రారంభించి ప్రాముఖ్యతను పెంచితే పుష్కరాలకు వచ్చే భక్తులు, పర్యాటకుల నుంచి హెలీ టూరిజానికి మరింత రద్దీ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఎన్ని అందాలో...

గోదావరి.. పాపికొండలు.. ఈ రెండింటి నడుమ ప్రకృతి అందాలు అన్నీ ఇన్నీ కావు. ప్రకృతి ప్రియుల మనసు దోచే సుందర దృశ్యాలెన్నో ఇక్కడ కనువిందు చేస్తాయి. అందుకే అనేక సంస్థలు గోదారి ఒడ్డున ఇసుక తిన్నెల్లో ప్రత్యేక గుడారాలు నిర్మించి మరీ గోదారి అందాలను అనుభవించేలా ప్యాకేజీలు వసూలు చేసి అలరిస్తున్నాయి. ఎండాకాలం, శీతాకాలంలో అయితే గోదావరి అందాలను వర్ణించడానికి మాటలు చాలవు. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు అయితే రాజమహేంద్రవరం నుంచి పాపికొండలకు బోటు షికారు ఎప్పటికీ మర్చిపోలేరు. ఇప్పుడు ఈ అందాలను బోట్ల ద్వారానే కాకుండా ఆకాశ మార్గాన కూడా హెలీకాప్టర్‌లో చూపించేందుకు పర్యాటకశాఖ సిద్ధమవుతోంది. పర్యాటకులను అలరించేందుకు పర్యాటక శాఖ ఈ మార్గంలో హెలీకాప్టర్‌ను నడిపాలని భావిస్తోంది. తద్వారా మరింత మంది టూరిస్టులను ఆకట్టుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచుతూ..

జిల్లా అభివృద్ధికి శ్రీకారం : కలెక్టర్



అమలాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచుతూ అన్ని రంగాల్లో జిల్లాను ప్రగతి పథంలోకి తీసుకువచ్చేలా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో శనివారం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది పాలనలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను విశదీకరించారు. తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 216 జాతీయ రహదారి సమస్యలను నాలుగు నెలల కాల వ్యవధిలో పరిష్కరించామన్నారు. సెప్టెంబరు నెలాఖరు నాటికి ప్యాచ్ వర్క్ పనులు పూర్తిచేసి పూర్తిస్థాయిలో రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈదరపల్లి, నడిపూడి వంతెనల నిర్మాణాలు పూర్తయ్యాయని, రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించి ఆ రెండు జంక్షన్లలో సుందరీకరణ పనులు పూర్తి చేయడం ద్వారా పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు మార్గం సుగమం అవుతోందన్నారు. మరో బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు మంజూరు అయ్యాయన్నారు. అందుబాటులోకి తీసుకువచ్చిన రైతుబజార్‌ను రూ.60 లక్షల అంచనా వ్యయంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. స్థానికంగా పండే వరి, కొబ్బరి, కోకో పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్కుల ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులకు యూనిట్లు ఏర్పాట్లు చేసేలా ప్రభుత్వం వివిధ రకాల రాయితీలతో ప్రోత్సహిస్తోందన్నారు. క్వాయర్ మేట్ల తయారీని ఇప్పటికే ప్రోత్సహించామన్నారు. కోనసీమ వలసదారుల కేంద్రం ఏర్పాటుచేసి 70 సమస్యలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించడంతోపాటు సమస్యల్లో చిక్కుకున్న వారిని స్వదేశానికి తీసుకురావడం జరిగిందన్నారు. సముద్రపు నాచు తయారీ ద్వారా తీర ప్రాంత ప్రజలు, డ్వాక్రా మహిళల తలసరి ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు చేపట్టామన్నారు. కొబ్బరి నుంచి 40 రకాల విలువ ఆధారిత వస్తువులను తయారుచేసే విధానాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. శాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ మెనేజ్‌మెంట్ యూనిట్లను నెలకొల్పడం ద్వారా అమలాపురం పట్టణ, పరిసర గ్రామాల్లోని డంపింగ్ యార్డుల నుంచి చెత్తాచెదారాలను సేకరించి ప్లాస్మా టెక్నాలజీతో బూడిద చేసే ప్రాసెసింగ్‌పై అధ్యయనం జరుగుతోందన్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణమండలి ద్వారా రూ.5 కోట్ల వ్యయంతో యూనిట్ స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. నరేగా అనుసంధానంతో కొబ్బరి తోటల్లో పశుగ్రాస అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. వసతిగృహ విద్యార్థులకు మొదటి గోల్డెన్ అవర్‌లో వైద్య సహాయం అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

పరదాల మాటున..

పాఠ్యాంశాల బోధన!

అసౌకర్యాలతో విద్యార్థుల వెతలు

ఇదీ సర్కారు పాఠశాలల తీరు






పి.గన్నవరం మండలం ముంగండపాలెం మండల పరిషత్ పాఠశాలకు అసంపూర్తి భవన నిర్మాణం.. బరకాలే గోడలుగా చేసుకుని పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు.. పునాదులకే పరిమితమైన వంటషెడ్డు



పి.గన్నవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోవడంతో ఆ.. పాఠశాల విద్యార్థులకు పరదాల మాటున పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. దీంతో ఆ పాఠశాలలో విద్యార్థులు అసౌకర్యాల నడుమ విద్యను అభ్యసిస్తున్నారు. పి.గన్నవరం మండలం ముంగండపాలెం మండల ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల భవన సముదాయం అసంపూర్తిగా ఆగిపోవడంతో చేసేదిలేక ఓపెన్ శ్లాబుతో ఉన్న భవనానికి రక్షణగా బరకాలు ఏర్పాటుచేశారు. ఆ పరదాల మాటునే ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. పాఠశాల భవనం శిథిలం కావడంతో సంబంధిత భవనాన్ని వైసీపీ హయాంలో వేలంపాట ద్వారా తొలగించారు. అనంతరం నాడు-నేడు రెండవ ఫేజ్‌లో రూ.24.98 లక్షలు మంజూరు చేసి భవన సముదాయానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అప్పట్లో నిబంధనల ప్రకారం సంబంధిత ఉపాధ్యాయుడు పాఠశాల భవన నిర్మాణం చేపట్టగా రూ.11.08 లక్షల వరకు బిల్లులు చెల్లించారు. మిగిలిన నిధులు విడుదల కాకపోవడంతో భవనం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. అద్దె భవనంలో ప్రభుత్వ పాఠశాలను నడపలేక ఉన్న భవనానికే చుట్టూ బరకాలు ఏర్పాటు చేసుకుని తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే వంటషెడ్డు, విద్యార్థుల టాయిలెట్స్ సైతం ఇంకా పునాదుల్లోనే ఉన్నాయి. కాగా 1 నుంచి 5 తరగతులకు సంబంధించి మొత్తం 17 మంది విద్యార్థులు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కల్పించుకుని త్వరితగతిన బిల్లులు మంజూరు చేసి భవన సముదాయం, మౌలిక వసతులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. కాగా నాడు-నేడు పనులు నిమిత్తం అప్పట్లో వైసీపీ ప్రభుత్వం హడావుడి చేస్తే చేసేది లేక పలువురు ఉపాధ్యాయులు తమ జేబుల్లో సొమ్మును సైతం ఖర్చు చేసి ప్రస్తుతం బిల్లులు కోసం ఎదురుచూపులు చూస్తున్న పరిస్థితి నెలకొంది.







జై..జై గణేశా

ధవళేశ్వరం రథం వీధిలో కాణిపాకం వినాయకుడి ఆకారంతో నీటిలో ఏర్పాటు చేసిన 10 అడుగుల గణనాథుడి విగ్రహం | సామర్లకోట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శ్రీనివాసుడి ఆకారంలో ఏర్పాటు చేసిన 12 అడుగుల గణపతి | మండపేటలో కొలువైన త్రిముఖ గణనాథుడు | ధవళేశ్వరం పిన్నింటి వారి వీధిలో శనివారం రాత్రి సరస్వతి పూజ చేసి.. గణపతికి వేడుకుంటున్న చిన్నారులు | బిక్కవోలుకు శనివారం భక్తజనం పోటెత్తారు.. 1100 ఏళ్ల కిందటి భారీ గణనాథుడి చెవిలో కోర్కెలు చెప్పి తీర్చమని వేడుకున్నారు.

ఆర్టీషీ..ఛాన్స్!

ఆర్టీసీ ప్రగతి రథ సారథులుగా అతివలు

అమ్మాయిలకో అవకాశం..ఆర్టీసీలో అన్ని విభాగాల్లోనూ మహిళలు ఉన్నారు.. ఒక్క డ్రైవింగ్ విభాగంలో తప్ప.. ప్రస్తుతం ఆ విభాగంలోనూ యువతులకు అవకాశం ఇవ్వనున్నారు.. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాకు ఐదుగురికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.. ఆ లెక్కన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 మందికి అవకాశం దక్కనుంది. ఇంకెందుకు ఆలస్యం ఆర్టీసీ శిక్షణ తీసుకోండి.. మీరూ డ్రైవర్లుగా మారిపోండి..

- 15 మంది యువతులకు అవకాశం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉచిత శిక్షణ



అమలాపురం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పురుషులతో సమానంగా మహిళలు కండక్టర్లుగా పనిచేస్తున్నారు. త్వరలో పురుషులకు సమానంగా మహిళా డ్రైవర్లు రానున్నారు. ఈ మేరకు తొలుత ఎస్సీ కార్పొరేషన్ ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్టీసీ సంస్థ నిర్వహించే డ్రైవింగ్ స్కూల్స్‌లో జిల్లాల వారీగా మగువలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఎస్సీ అభ్యర్థులకు హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. తొలి విడతలో జిల్లాలో షెడ్యూల్డు కులాలకు చెందిన ఐదుగురు పురుషులతో పాటు తొలిసారిగా ఐదుగురు మహిళలకు హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ శిక్షణ అందిస్తామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి తెలిపారు. ఆసక్తి గల పురుష అభ్యర్థులతో పాటు స్త్రీలు సైతం సెప్టెంబరు 5వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

శిక్షణకు నిబంధనలు ఇలా..

ఆర్టీసీ సిబ్బంది హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తారు. కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. అభ్యర్థులు విధిగా లైట్ మోటారు వెహికల్ లైసెన్స్ తీసుకుని ఏడాది పూర్తయి ఉండాలి. హెవీ డ్రైవింగ్ లెర్నర్ లైసెన్స్ కలిగి ఉండాలి. కనీస వయసు 20 ఏళ్లుగా నిర్ధారించారు. పురుష అభ్యర్థులతో సమానంగా ఆయా ఆర్టీసీ డిపోలోని డ్రైవింగ్ కళాశాలలోనే మహిళా అభ్యర్థులు శిక్షణ పొందాలి. 40 రోజుల శిక్షణలో థియరీతో పాటు ప్రాక్టికల్స్ ఉంటాయి. మహిళా అభ్యర్థులు ఖాకీ ప్యాంటు, షర్టు ధరించాలి. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆర్టీసీ సంస్థ సర్టిఫికెట్లు అందజేస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఆర్టీసీ సంస్థ డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు. నోటిఫికేషన్ వచ్చే వరకు ఆర్టీసీలో రోజువారీ వేతనం విధానంలో పనిచేయడానికి సైతం అవకాశం ఉంటుంది.

దరఖాస్తులు ఇలా...

కార్పొరేషన్ (కాకినాడ)/ ముమ్మిడివరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జిల్లాకు ఐదుగురు పురుషులు, ఐదుగురు స్త్రీలకు మొత్తం 30 మం దికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ (హెచ్ఎంవీ) ఉచిత శిక్షణ నిమిత్తం సెప్టెంబర్ 5వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత తెలి పే జిరాక్స్, ఆధార్ కార్డు, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ (ఎల్ఎంవీ) లైసెన్స్, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్టీసీ నిబంధనలకు అంగీకారం, కులధ్రువీకరణ పత్రం దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా జతపరచాలన్నారు. కార్యనిర్వాహక సంచాలకులు, జిల్లా షెడ్యూల్డుకులాల సహకార సంఘం లిమిటెడ్, ప్రగతి భవన్ కాకినాడకు సెప్టెంబరు 5వ తేదీ 5 గంటలలోపు స్వయంగా గానీ, పోస్టల్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.సుధారాణి,సెల్ 93989 07208, 62818 17023 సంప్రదించాలన్నారు.

గోదావరి ప్రవహిస్తున్నంత కాలం

ఎస్పీబీ పాట వినిపిస్తూనే ఉంటుంది

- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి
- ఎస్పీ శైలజ, సుధాకర్ దంపతులతో కలిసి ధవళేశ్వరంలో విగ్రహావిష్కరణ

ధవళేశ్వరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవహిస్తున్నంతకాలం ఎస్పీబాలసుబ్రహ్మణ్యం పాట ప్రపంచమంతా వినిపిస్తూనే ఉంటుందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి అన్నారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయ ఎదురుగా ఉన్న పార్కులో గాన గంధర్వుడు ఎస్పీబీ నిలువెత్తు విగ్రహాన్ని గాయని ఎస్పీ శైలజ, నటుడు శుభలేఖ సుధాకర్‌తో కలిసి ఎమ్మెల్యే గోరంట్ల శనివారం ఆవిష్కరించారు. ఇదే పార్కులో ఘంటసాల విగ్రహాన్ని గతంలో ఎస్పీబీ ఆవిష్కరించడం విశేషం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విగ్రహావిష్కరణలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా పేర్కొంటూ త్వరలో రాజమహేంద్రవరంలో ఆయన విగ్రహాన్ని నెలకొల్పుతామని ప్రకటించారు. ఈ సందర్భంగా శుభలేఖ సుధాకర్, ఎస్పీ శైలజ మాట్లాడుతూ గోదావరి తీరాన ఆయన విగ్రహావిష్కరణ ఇంత ఘనంగా జరగడం ఆనందంగా ఉందన్నారు. ఘంటసాల విగ్రహానికి నివాళులర్పించారు. అంతకుముందు వీరికి సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్, రాకా రమణ, డాక్టర్ కంటే వీరన్నచౌదరి, యర్రమోతుధర్మరాజు,తిరుమల కృష్ణమోహన్, గ్రంధి జగన్నాథం, ఏడుకొండలు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, సీసీసీ ఛానల్ ఎండీ కొండలరావు, విగ్రహదాతగాలి సుబ్బరాజు మాట్లాడారు.రాకా, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు గౌరీశంకర్, తాతారావు, రామరాజు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న గోరంట్ల

ఎస్పీ బాలు స్మరణ సంగీత విభావరి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో శనివారం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంస్మరణార్థం సంగీత విభావరి జరిగింది. ముందుగా రాజమహేంద్రవరం డాక్టర్స్ కిడ్స్ సమర్పించిన బాలరామాయణం ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. శుభలేఖ సుధాకర్, ఎస్పీ శైలజ దంపతులు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఉండవల్లి అరుణ్‌కుమార్, అల్లు బాబీ, గాలి సుబ్బరాజు, వేగిశెట్టి కోదండరామయ్య, కంటే వీరన్నచౌదరి, రాకా అధ్యక్షుడు జీవీ రమణ, ఎస్పీ బాలు స్నేహితుడు జీవీ మురళి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎస్పీ బాలు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. సంగీత విభావరిలో గాయకులు తమ పాటలతో అలరించారు.



ఆనం కళాకేంద్రంలో ఆకట్టుకున్న రాజమహేంద్రవరం డాక్టర్స్ కిడ్స్ బాలరామాయణం ప్రదర్శన



సంగీత విభావరిలో పాట పాడుతున్న ఎస్పీ శైలజ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక నేడు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మండపేటలో జిల్లా టెన్నికాయిట్ అధ్యక్షురాలు అప్పసాని కృష్ణకుమారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కోశాధికారి ఎస్ఎం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మూడు విభాగాలకు సంబంధించి టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నామన్నారు. సబ్ జూనియర్ విభాగం క్రీడాకారులు 2011జనవరి1 తరువాత పుట్టి ఉండాలన్నారు. జూనియర్ విభాగం 2007 జనవరి 1 తరువాత పుట్టి ఉండాలన్నారు. స్త్రీ. పురుషులు విభాగం వయసుతో సంబంధం లేకపోయినా పాల్గొనే క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డ్, ప్రోపెర్ యూనిఫామ్‌తో హాజరుకావాలన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారు సెప్టెంబర్ నెలలో మండపేటలో జరుగనున్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ లో పాల్గొంటారని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కోశాధికారి రామారావు తెలిపారు. ప్రతిభను బట్టి అక్టోబర్ 8 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్ నోయిడాలో జరుగనున్న జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికవుతారని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. వివరాలకు 9705551345 ఈ నెంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

సామర్లకోట వీబీఆర్ఐ జేడీగా డాక్టర్ షానిలాకుమారి

సామర్లకోట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో వెటర్నరీ బయోలాజికల్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ జాయింట్ డైరెక్టర్‌గా ప్రకాశంజిల్లా ఒంగోలు ఏడీడీఎల్ గా పనిచేస్తున్న డాక్టర్ షానిలాకుమారిని పదోన్నతిపై బదిలీచేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ జీవో ఆర్‌టీ నెంబరు 306 పేరిట ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఉత్తర్వుల ప్రకారం సోమవారం సామర్లకోట కు చేరుకుని వీబీఆర్‌ఐలో జేడీగా బాధ్యతలు స్వీకరించ నున్నారు. గత జూన్ నెల వరకూ జేడీగా పనిచేసిన డా క్టర్ రత్నకుమారి దీర్ఘకాలపు సెలవుపై వెళ్లడంతో వీబీఆర్‌ఐలో ఏడీగా వ్యవహరిస్తున్న డాక్టర్ శ్రీనివాసు ఇన్‌చార్జి జేడీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజా ఉత్తర్వుల మేరకు సోమవారం జేడీగా షానిలాకుమారి బాధ్యతలు స్వీకరించనున్నట్లు వీబీఆర్ఐ అధికారులు తెలిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు

భక్తజన సంద్రం.. వెంకన్న క్షేత్రం

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారి ఆదాయం రూ.67.48లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వా మివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు.భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్ర దర్శనలు నిర్వహించారు. ఆలయంలో వివిధ విభాగాలను ఉపకమిషనర్ పరిశీలించారు. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.67.48లక్షలు లభించినట్లు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభస్వామి

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగారవల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 8వేల మందికి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రూ.2,36,023 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

ఆరుగురు ఎంపీడీవోలకు పదోన్నతులు

సామర్లకోట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో వివిధ మండ లాల్లో ఎంపీడీవోలుగా పనిచేస్తున్న ఆరుగురికి డీఎల్‌డీవోలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి, సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కేఎస్వీ ప్రసాదరావు అందించిన సమాచారంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డీఎల్‌డీవోలుగా పదోన్నతులు పొందిన వారిలో పెద్దాపురం ఎంపీడీవో డి.శ్రీలలిత, కరప ఎంపీడీవో ఎం. అనుపమ, ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ, రావులపాలెం ఎంపీ డీవో ఈ.మహేశ్వరరావు, మారేడుమిల్లి ఎంపీడీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్, గృహ నిర్మాణమంత్రివద్ద ఓఎస్‌డీగా పనిచేస్తున్న డాక్టర్ ఎన్.ప్రకాశరావులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 53మంది ఎంపీడీవోలకు డీఎల్‌డీవోలుగా పదోన్నతులు లభించినట్లు రాష్ట్ర నాయకులు ప్రసాదరావు తెలిపారు. వీరికి పదోన్నతులతో పోస్టింగ్‌లు ఎక్కడెక్కడ ఇచ్చేది మరో మూడు రోజులలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రానున్నట్లు తెలిపారు.

ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలి

- టెలికాన్ఫరెన్స్‌లో ఆదేశించిన వ్యవసాయశాఖ కమిషనర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 30(ఆంధ్ర జ్యోతి): కాకినాడజిల్లాలో ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని రాషవ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీ రావు ఆదేశించారు. శనివారం ఆయన జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. నెలరోజుల సమయంలో నిర్ధేశించిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. వ్యవసాయశాఖ పరిధిలో ఉన్న 2లక్షల 25వేల ఎకరాలతోపాటు ఉద్యానశాఖ పరిధిలో ఉన్న 75వేల ఎకరాల పంటపొలాలను ఈ-క్రాప్ బుకింగ్ చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే పంటల బీమా, రాయితీలు, నష్టపరిహారం, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు పొందాలంటే ఈ-క్రాప్‌లో నమోదు తప్పకుండా చేయాలన్నారు. దీనిపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్, ఇతర వ్యవసాయశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం పాదగయ క్షేత్రంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ పూజలు



పాదగయ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, గణపతి సచ్చిదానందస్వామిజీని దర్శించుకున్న దృశ్యం

పిఠాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు సందర్శించారు. పట్టణంలోని పాదగయలో కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమశక్తి పీఠం అధిష్టాన దేవతైన పురుహూతికా అమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. డిప్యూటీ స్పీకర్‌ను ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల ఫొటోలను అందజేశారు. ఈ సందర్భంగా రఘురామ మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం కుక్కుటేశ్వరస్వామి, శక్తిపీఠాన్ని దర్శించుకున్నానని, ఇప్పుడు మరలా ఆభాగ్యం కలిగిందని తెలిపారు. అంతకుముందు పిఠాపురం పర్యటనకు వచ్చిన డిప్యూటీ స్పీకర్ రఘురామకు ఘనస్వాగతం లభించింది. అనఘా దత్తక్షేత్రంలో టీడీపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో పాదగయ మాజీ చైర్మన్ కొండేపూడి సూర్యప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా సతీష్, ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మడికి ప్రసాద్, కొరుప్రోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తెలిపారు. క్షేత్రంలో ఉన్న మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ, చాతుర్మాస్యవ్రత దీక్షలో ఉన్న ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామిజీలను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన నడుస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రధాని వచ్చినా ఎంపీగా నా నియోజకవర్గానికి రాలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితిలేదన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు డిప్యూటీ స్పీకర్‌ను సత్కరించారు.



పిఠాపురంలో భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేస్తున్న మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ

అహాన్ని వీడకుంటే పతనం తప్పదు

- మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ

పిఠాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మనిషి అహాన్ని వీడకుంటే పతనం తప్పదని, అహాన్ని వీడితే బ్రహ్మను చేరుకునేశక్తి మానవుడికే ఉందని మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ అనఘా దత్త క్షేత్రంలో పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామిజీ నిర్వహిస్తున్న చాతుర్మాస్య వ్రత దీక్షా మహోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన శనివారం భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. డబ్బుపై ఆశ వదులుకోవాలని, కుటుంబంపై ప్రేమ చూపాలన్నారు. లోకం మీద ఆశలతో ఆధ్యాత్మిక భావనను విడనాడుతున్నారని, ఇది మంచిది కాదన్నారు. ఈ భూమి మీద అన్ని జీవులు తలదించుకుని నడుస్తాయని మనిషి మాత్రమే తలెత్తుకుని నడుస్తాడని తెలిపారు. తాను ఎక్కడి నుంచి వచ్చాడో తెలుసుకునే శక్తి ఒక్క మానవుడికే ఉందని చెప్పారు. సాధన, తపస్సు ద్వారా మాత్రమే పరబ్రహ్మ స్థితికి చేరుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమాలకు భక్తులు భారీగా తరలివచ్చారు.

తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ 2025-28కి గాను ఎలెక్షన్ ఆఫీసర్‌గా రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా కె.ఎస్ శ్రీపతి, వైస్ ప్రెసిడెంట్‌గా సర్ఫరాజ్‌నవాజ్, సెక్రెటరీగా నక్కా వెంకటేష్ జాయింట్ సెక్రెటరీగా లలిత కుమార్, కోశాధికారిగా గరగా అప్పారావు, కౌన్సిలర్‌గా నిమ్మల సత్యానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ సెక్రటరీ పి.సత్యనారాయణ, మాజీ రంజీ క్రీడాకారుడు అహ్మద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పాదగయలో వ్యవసాయశాఖ కమిషనర్, కలెక్టర్ పూజలు



పిఠాపురం పాదగయ క్షేత్రంలో వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు, తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ ప్రశాంతిలకు స్వామి, అమ్మవార్ల ఫొటోను అందజేస్తున్న ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్

పిఠాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు, తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ ప్రశాంతిలు శనివారం సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. కమిషనర్, కలెక్టర్‌లను పాదగయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహనశ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి ఉన్నారు.

మళ్లీ నిరాశేనా..?



- సెప్టెంబర్ రేషన్‌లోనూ కందిపప్పు లేనట్టే!
- పేదలు బయట కొనుక్కోవాల్సిందేనా?
- నోరుమెదపని పౌరసరఫరాలశాఖ అధికారులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అవును! పేదోళ్లు.. అప్పు చేసి 'పప్పు' కూడు తినాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఆకాశ్నంటుతున్న కందిపప్పు ధరే దీనికి కారణమని తెలుస్తోంది. మరోవైపు రేషన్ దుకాణాల ద్వారా అందజేసే కందిపప్పు సెప్టెంబర్ నెలలోనైనా ఇస్తారో! లేదో! అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత ఐదు నెలలుగా కందిపప్పు చేతికి చిక్కడం లేదు.. నోటికి అందడం లేదని కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో అరకొరగా అందిన కందిపప్పు కూటమి ప్రభుత్వంలో ఆచూకీ లేకుండా పోయిందంటున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం పేదలకు నిత్యావసరాలైన బియ్యం, చక్కెర, పామాయిల్‌తో పాటు కందిపప్పును సబ్సిడీపై అందజేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 15వేల మంది రేషన్‌కార్డుదారులు ఉన్నారు. కాకినాడ జిల్లాలో 6 లక్షల 54 వేల మంది రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరికి నెలకు 300 మెట్రిక్ టన్నులు కందిపప్పు కేటాయించాలి. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3 లక్షల 75 వేల రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరికి 200 మెట్రిక్ టన్నులు, తూర్పుగోదావరి జిల్లాలో ఐదు లక్షల రేషన్ కార్డులకు 300 మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించాలి. మొత్తంగా మూడు జిల్లాలు కలిపి 800 మెట్రిక్ టన్నులను ప్రభుత్వం సరఫరా చేయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొంతకాలం క్రమం తప్పకుండా కందిపప్పు అందించినా.. ఐదు నెలలుగా సరఫరా నిలిపివేసింది. అమరావతిలో కందిపప్పు టెండర్లు ఖరారు కాకపోవడం వల్లే సరఫరా నిలిచిపోయిందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కందిపప్పు ధర కిలో రూ.120 నుంచి రూ.140 మధ్యలో ఉంది. రేషన్ కార్డుదారులకు సబ్సిడీపై కిలో కందిపప్పు రూ.67కే అందించాలి. ప్రభుత్వం బహిరంగ మార్కెట్లో హోల్‌సేల్‌గా కొంటే కిలో రూ.వందకు లభించే అవకాశం ఉంది. రేషన్ డీలర్లు ప్రతి నెలా 20వ తేదీలోపు డీడీలు తీసి, తమ పరిధిలోని కార్డుదారులకు అవసరమైన బియ్యం, కందిపప్పు, పంచదార తదితర సరుకులు దిగుమతి చేసుకుంటారు. కొన్ని నెలలుగా డీలర్లు డీడీలు తీస్తున్నా పౌరసరఫరాల శాఖ మాత్రం అవసరమైన మేరకు కందిపప్పు సరఫరా చేయడం లేదు. ఇక జిల్లాల్లోని ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం ఏ ఒక్క ఎంఎల్ఎస్ పాయింట్‌లోనూ కందిపప్పు నిల్వలు లేవు. రేషన్‌షాపులు, ఎంఎల్ఎస్ పాయింట్లలో కందిపప్పు నిల్వలు నిండుకోవడంతో కార్డుదారులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనాల్సి వస్తోంది. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక నెల కందిపప్పు ఇస్తే రెండు నెలలు కోత విధించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక క్రమం తప్పకుండా పంపిణీ చేసినా.. ఐదు నెలలుగా సరఫరా కావడం లేదు. అయితే సెప్టెంబర్ నెలలో కూడా కందిపప్పు సరఫరాకు సంబంధించి ఎటువంటి కేటాయింపులు లేవని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు రేషన్ డీలర్లను కూడా కందిపప్పునకు సంబంధించి డీడీలు తీయాలని ఈ నెల కూడా సమాచారం రాకపోవడంతో సెప్టెంబర్ నెలలోనూ కందిపప్పు లేనట్టేనని తెలుస్తోంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ..

కార్పొరేషన్ డైరెక్టర్లుగా పలువురికి అవకాశం



పిఠాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో నాలుగు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోగా అందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లానుంచి పలువురికి అవకాశం లభించింది. ఏపీస్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారటీ డైరెక్టర్‌గా పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలం అమీనాబాదుకు చెందిన వంకా కొం డబాబును నియమించారు. ఈయన జనసేన పార్టీకి చెందినవారు. ఆయనతోపాటు డైరెక్టర్లుగా టీడీపీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం నియోజకవర్గానికి చెందిన దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన విత్తనాల నాగశ్రీనివాస్ నియమితులయ్యారు. ఏపీ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్‌గా జనసేన పార్టీ నుంచి కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన శిరంగు శ్రీనివాసరావు, ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన కొమాముల తిరుమలకుమార్ (టీడీపీ) నియమితులుగా కాగా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లుగా రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన సలాది పట్టాభిరామయ్య (టీడీపీ), తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గానికి చెందిన కూచిపూడి ఉదయభాస్కర్ (టీడీపీ) నియమితులయ్యారు.

క్రమంగా పెరుగుతున్న శబరి

- లోతట్టు ప్రాంతాల్లో చింతూరు ఐటీడీఏ పీవో శుభం నౌఖ్వాల్ పర్యటన



నాటు పడవపై ప్రయాణిస్తున్న పీవో శుభం నౌఖ్వాల్

చింతూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శబరి నదికి మళ్లీ వరద పెరుగుతోంది. శుక్రవారం అర్ధరాత్రి చింతూరు వద్ద నీటిమట్టం 28 అడుగుల మేర ప్రవహించగా, శనివారం సాయంత్రం తిరిగి 33 అడుగులకు చేరుకుంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే భద్రాచలం వద్ద 47.6 అడుగుల మేర గోదావరి ప్రవహిస్తోంది. అక్కడ గంటకు అంగుళం మేర ఉధృతి పెరుగుతోంది. కూనవరం వద్ద గోదావరి శబరికి ఎగపోటు నివ్వడంతో శబరి తిరిగి పెరగడం మొదలైంది. దీంతో ఒడిశా జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలన్నీ హుటాహుటిన లోతట్టు ప్రాంతాన్ని దాటించి గమ్యస్థానానికి పయనమయ్యాయి. ఇక జలదిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాల ప్రజల అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. చింతూరు ఐటీడీఏ పీవో శుభం నౌఖ్వాల్ శనివారం నాటు పడవపై సోకిలేరు దాటి ఏజీ కొడేరు వెళ్లి అక్కడ పరిస్థితిని పరిశీలించారు.

మోతుగూడెం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో క్రమంగా నీటినిల్వలు పెరుగుతున్నాయి. బలిమెల జలాశయం దిగువన ఉన్న గుంటవాడ (సీలేరు), డొంకరాయి జలాశయాలకు కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బలిమెల జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1516 అడుగులు. ఇక్కడ 127.70 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు, ఎగువన ఉన్న జోలాపుట్ నుంచి పదివేల క్యూసెక్కుల చొప్పున నీటిని బలిమెలకు విడుదల చేస్తుండంతో పాటు నదీ పరీవాహక ప్రాంతాల వాగుల నుంచి కూడా మరో 11వేల క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో బలిమెలకు మొత్తం 21వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దీంతో శనివారం నాటికి బలిమెలలో 1481.20 అడుగులకు నీటిమట్టం చేరింది. అలాగే డొంకరాయి జలాశయం 1032.10 అడుగులకు చేరింది. మరో 4.40 అడుగుల నీటిమట్టం పెరిగితే నీటిని దిగువకు విడుదల చేయాల్సి ఉంటుందని జెన్‌కో అధికారులు తెలిపారు.

ఈ-సేవతో కోర్టు సేవలు

మరింత సులభం

రాజమహేంద్రవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఈ-సేవ కేంద్రాల ద్వారా ప్రజలు కోర్టు సేవలను మరింత సులభంగా పొందడానికి వీలు కలుగుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని తూర్పుగోదావరి జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ-సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా న్యాయవాదులు వారి వృత్తిలో సమర్థతను పెంపొందించుకోవచ్చన్నారు.

ఉరకలెత్తుతున్న గోదావరి ప్రవాహం

- ధవళేశ్వరం వద్ద రాత్రి 8.35 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- 11.75 అడుగులకు చేరిన నీటి మట్టం
- 10,00,1410 క్యూసెక్కులు దిగువకు విడుదల
- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక
- 48 అడుగుల దిశగా పెరుగుతూ 47.70 అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతున్న నీటిమట్టం



కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో ధవళేశ్వరంవద్ద గోదావరి ఉరలెత్తుతూ సముద్రం వైపు ప్రవహిస్తోంది. శనివారం తెల్లవారుజామున మూడుగంటల నుంచి క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం గంటలకు ఒక్క పాయింట్ చొప్పున పెరుగుదల నమోదు చేసుకుంటుంది. శనివారం ఉదయానికి కాటన్ బ్యారేజ్ ద్వారా 7,62,218 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుండగా రాత్రి 8.35 గంటలకు నీటిమట్టం 11.75 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కంజర్వేటర్ శ్రీనివాసరావు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో 10,00,1410 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ఇదే ఒరవడి కొనసాగితే ఆదివారం నాటికి మరో 2లక్షల క్యూసెక్కుల వరకు ప్రవాహం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలంవద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం శనివారం రాత్రి 7గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక చేరువలో 47.70 అడుగుల మధ్య నిలకడగా కొనసాగుతోంది.

ఎగువ నీటిమట్టాలు ఇవే..

రాత్రి ఏడు గంటల సమయానికి ఎగువున కాళేశ్వరంవద్ద నీటిమట్టం 12.510 మీటర్లుగా నమోదు కాగా పేరూరు వద్ద 16.760 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 12.900 మీటర్లు, భద్రాచలం వద్ద 47.70 అడుగులు, కూనవరం వద్ద 18.970 మీటర్లు, కుంట వద్ద 10.200 మీటర్లు, పోలవరం వద్ద 12.220 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 15.850 మీటర్లుగా నీటిమట్టం నమోదైంది.

8 రోజుల వ్యవధిలో రెండోసారి..

గత ఎనిమిది రోజుల వ్యవధిలో గోదావరి ధవళేశ్వరం వద్ద ప్రమాద హెచ్చరిక స్థాయిలో ప్రవహించింది. ఈనెల 21వ తేదీ ఉదయం 6గంటలకు నీటిమట్టం 11.75 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయింది. ఆపై 20 గంటల వ్యవధిలో నీటిమట్టం 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. ఆపై నీటిమట్టం తగ్గడంతో 23వతేదీ ఉదయం మొదటి ప్రమాద హెచ్చరిక, రాత్రి 2వ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. వారం రోజులు నీటిమట్టం పెరుగుతూ.. తగ్గుతూ ప్రవహించి శనివారం రాత్రికి మొదటి ప్రమాద హెచ్చరికకు చేరుకుంది.

తలకు గాయమై ఏడో తరగతి విద్యార్థిని మృతి



మృతి చెందిన దివ్యతేజ

- మారేడుమిల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఘటన
- హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంపై బంధువులు, ఆదివాసీ సంఘాల ఆందోళన

మారేడుమిల్లి/రంపచోడవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని తలకు గాయమై శనివారం మృతి చెందింది. మండలంలోని చట్లవాడ పంచాయతీ గొందివాడ గ్రామానికి చెందిన చెదల ధర్మారెడ్డి, వెంకటలక్ష్మిల కుమార్తె దివ్యతేజ(11) మారేడుమిల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. శుక్రవారం సాయంత్రం వసతి గృహంలోని మరుగుదొడ్ల వద్ద కాలు జారి పడిపోవడంతో తలకు గాయమైంది. ఆ సమయంలో విద్యార్థినిని సిబ్బంది పట్టించుకోకపోవడంతో శనివారం ఉదయానికి అపస్మారక స్థితికి చేరుకుంది.తోటి విద్యార్థులు గమనించి సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆపై మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

చర్యలు చేపట్టే వరకూ పోస్టుమార్టం వద్దు

సమాచారం అందుకుని రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వచ్చిన విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులకు పలు ఆదివాసీ, గిరిజన సంఘాలు బాసటగా నిలిచాయి. గాయపడిన బాలికను సిబ్బంది పట్టించుకోకపోవడంతో సకాలంలో వైద్యం అందక తమ కుమార్తె మృతిచెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహిస్తామని పోలీసులు చెప్పగా విద్యార్థిని మృతికి కారణమైన అందరిపై చర్యలు తీసుకునే వరకూ పోస్టుమార్టం జరగనివ్వబోమని బాధిత బంధువులు, ఆదివాసీ నాయకులు ఆందోళనకు దిగారు. డీఎస్పీ ప్రశాంతకుమార్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. అనంతరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం చేరుకోగా ఆయన్ను ముట్టడించి నిలదీశారు. దీంతో మారేడుమిల్లి ఆశ్రమ పాఠశాలలో ఏం జరిగిందో తెలుసుకుందామని పీవో చెప్పగా తామూ వస్తామని చెప్పి పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆందోళనకారుల డిమాండ్లకు పీవో అంగీకరించకపోవడంతో తిరిగి రంపచోడవరం చేరుకుని ఆందోళన చేపట్టారు. తదుపరి ఆందోళనకారులతో డీఎస్పీ చర్చలు జరపడం, డిమాండ్లకు ఐటీడీఏ అంగీకరించడంతో ఆందోళనను విరమించారు. అప్పటికే పొద్దుపోవడంతో శవపంచనామా, పోస్టుమార్టమ్‌లను ఆదివారం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కాగా విద్యార్థిని మృతిపై విచారణకు సబ్ కలెక్టర్ శుభం నౌఖ్వాల్ అధ్యక్షతన ఐదుగురు అధికారుల కమిటీని నియమించినట్టు పీవో ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని మృతికి కారణంగా వార్డెన్ ఎస్.సీతమ్మను సస్పెండ్ చేశారు. బాలిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు అంగీకరించి తక్షణ సాయంగా రూ.50 వేలు అందజేశారు. విద్యార్థిని మృతికి కారణమైన వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.అలాగే విద్యాలయంలోని ప్రైవేటు నర్సును తొలగిస్తున్నట్టు పీవో తెలిపారు.

జీవితాలను సోషల్ మీడియాలో పెట్టొద్దు



రాజమహేంద్రవరం సదస్సులో ప్రసంగిస్తున్న చైర్‌పర్సన్ శైలజ

- సురక్షితం మన చేతుల్లోనే..
- బాధ్యతనెరిగి నడుచుకోవాలి
- ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

రాజమహేంద్రవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జీవితాలను తీసుకెళ్లి సోషల్ మీడియాలో పెట్టవద్దని మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. మహిళల భద్రత, సంక్షేమం, హక్కులపై శనివారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. జ్యోతి ప్రకాశనం అనంతరం ఆమె మాట్లాడుతూ సురక్షితం అనేది మన చేతుల్లోనే ఉందని, బాధ్యతనెరిగి నడుచుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల వల్ల ప్రేమలు, పెళ్లిళ్లు పెరిగాయని, అదే సమయంలో బాధితులుగా మారుతున్న మహిళల సంఖ్య కూడా పెరుగుతోందన్నారు. మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలపై మౌనంగా ఉండడం సరికాదన్నారు.రిపోర్టు చేయాలన్నారు. అనకాపల్లి జిల్లాలో ఒక లెక్చరర్ విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించడం ఎప్పటి నుంచో జరుగుతున్నా ఒక విద్యార్థిని ధైర్యంగా ముందుకొచ్చి చెప్పడం వల్ల అక్కడితో ఆ అమానుషాన్ని అపగలిగామన్నారు. స్నేహంగా ఉండడం తప్పుకాదని, అదే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడం ముఖ్యమన్నారు. పది మంది కంటే ఎక్కువ ఉద్యోగులున్న చోట కచ్చితంగా అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఉండాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. పోష్ చట్టంపై కూడా అవగాహన ఉండాలన్నారు. శక్తి యాప్ ప్రతివాళ్ల సెల్‌ఫోన్‌లో ఉండాలన్నారు. భద్రతాపరమైన సమస్య ఉంటే 181, 112కి కూడా కాల్ చేసి చెప్పవచ్చన్నారు. వన్‌స్టాప్ సెంటర్లలో బాధిత మహిళలకు వసతి కల్పించడంతోపాటు కౌన్సెలింగ్ చేస్తారన్నారు. ర్యాగింగ్, పోక్సో వంటి కేసుల్లో నిందితుల పేర్లను ఆయా విద్యా సంస్థల వద్ద ప్రదర్శించడం మంచి ఆలోచన అని కలెక్టర్ ప్రశాంతిని ప్రశంసించారు. కమిషన్ సభ్యురాలు జయశ్రీ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఫొటోలను మార్ఫింగ్ చేస్తున్న కేసులు పెరుగుతున్నాయని, ఇటీవల ఇలాంటి ఘటనలో ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఏఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఏడు శక్తి టీంలు పనిచేస్తున్నాయన్నారు. కళాశాలలతోపాటు మహిళలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో మఫ్టీలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. మహిళా పీఎస్ సీఐ మంగాదేవి, సైబర్ క్రైం ఎస్‌ఐ అయ్యప్ప రెడ్డి మాట్లాడుతూ ఏపీకే ఫైల్స్‌ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దన్నారు. స్టాప్ ఎన్‌సీసీఐ అనే వెబ్‌సైటు ద్వారా మార్ఫింగ్ ఫొటోలను తొలగించుకోవచ్చన్నారు. అనంతరం వివాహానికి ముందు కౌన్సెలింగ్ చేసే సెంటర్ల పోస్టర్‌ని చైర్‌పర్సన్ ఆవిష్కరించారు.

కళ్లలో కారం చల్లి..బంగారు నగలు చోరీ

ఐ.పోలవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇంట్లో టీవీ చూస్తున్న వృద్ధురాలి కంట్లో కారం చల్లి మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయారు. ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలెంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. భర్త గాదిరాజు సత్యనారాయణరాజు గదిలో నిద్రిస్తుండగా, భార్య కృష్ణవేణి టీవీ చూస్తున్న సమయంలో కళ్లల్లో కారం చల్లి ఆమె మెడలోని నాలుగు కాసుల బంగారు గొలుసును దుండగులు దోచుకెళ్లారు. ఆ ఇంట్లో వృద్ధ దంపతులు మాత్రమే నివాసముంటున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు బైక్‌పై పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో ఎస్‌ఐ రవీంద్రబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పెద్దాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళుతున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటన పెద్దాపురం మండలం ఉలిమేశ్వరం-చదలాడ రోడ్డులో శనివారం జరిగింది. కాండ్రకోట గ్రామానికి చెందిన ఒబిలిశెట్టి అమ్మలు తిరుపతి శృంగార వల్లభ స్వామి గుడికి వెళుతుండగా మార్గమధ్యలో ఓ దుండగుడు బెదిరించి మెడలో ఉన్న 4కాసుల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

150 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్

మోతుగూడెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్‌కి వచ్చిన సమాచారం మేరకు మర్రిగూడెం శివారులో ఒడిస్సా రాష్ట్రానికి మూడు ప్లాస్టిక్ బస్తాలతో 150 కిలోల గంజాయిని తరలిస్తున్న వంతల బలరామును అదుపులోకి తీసుకున్నారు. వంతల బలరామును అరెస్ట్ చేశారు. సీఐ సీహెచ్ గోపాలకృష్ణ నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

హోరాహోరీగా పవర్‌లిఫ్టింగ్ పోటీలు



అవార్డు అందుకుంటున్న శివకుమార్



అవార్డు అందుకుంటున్న అఖిల

- స్ట్రాంగ్ మెన్‌గా శివకుమార్
- ఉమెన్‌గా అఖిల
- మాస్టర్స్‌గా నాగేశ్వరరావు, అప్పన్న





అమలాపురం టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అమలాపురం దుడ్డువారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయి పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు నిర్వహించిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా బీవీవీ సత్యనారాయణ, ఎంవీ సముద్రం, వి.నరేష్, వి.గణేష్, డీఆర్కే నాగేశ్వరరావు, షేక్ వలీసాహెబ్, టి.జోసెఫ్‌లు వ్యవహరించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఫైనల్స్ విజేతలను కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ప్రకటించారు. స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా కాకినాడకు చెందిన కె.దుర్గాశివకుమార్, రన్నర్‌గా కాకినాడకు చెందిన కె.మోహన్‌లు నిలిచారు. స్ట్రాంగ్ ఉమెన్ విన్నర్‌గా రామచంద్రపురానికి చెందిన డి.అఖిలదేవి, రన్నర్‌గా అమలాపురానికి చెందిన వై.ఇందిర నిలిచారు. మాస్టర్స్ విభాగంలో స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా డి.నాగేశ్వరరావు (ద్రాక్షారామం), బి.అప్పన్న (అమలాపురం) టైటిల్స్‌ను దక్కించుకున్నారు. 66 కిలోల మహిళల విభాగంలో ఎస్.స్పందన (రాజోలు), 74కిలోల విభాగంలో పి.దీవెన (కాకినాడ), 83 కిలోల విభాగంలో డి.అఖిలదేవి (రామచంద్రపురం) విజేతలుగా నిలిచారు. సబ్‌జూనియర్స్ 53 కిలోల విభాగంలో పి.వీరేంద్ర (కాకినాడ), 59 కిలోల విభాగంలో జె.జితేంద్రదొర (అమలాపురం), 66 కిలోల విభాగంలో కె.సాయిమణికంఠ (కాకినాడ), 74 కిలోల విభాగంలో ఎంఎస్ విన్సెంట్ (జగ్గంపేట), 59కిలోల మెన్ విభాగంలో వై.రాజు (రాజమహేంద్రవరం), 66 కిలోల కేటగిరిలో ఎం.రాహుల్‌బాబు (అమలాపురం), 74 కిలోల విభాగంలో కె.దుర్గాసాయికుమార్ (కాకినాడ), 83 కిలోల కేటగిరిలో కె.మోహన్ (కాకినాడ), 93 కిలోల విభాగంలో కె.సుధీర్ (మలికిపురం), 105 కిలోల విభాగంలో బి.అనూష్‌బాబు (మురమళ్ల), మాస్టర్స్ 83 కిలోల విభాగంలో డి.నాగేశ్వరరావు, బి.అప్పన్నలు ప్రథమస్థానాలు సాధించి విజేతలుగా నిలిచినట్టు ప్రకటించారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మోకా వెంకటసుబ్బారావు, కల్వకొలను బాబు, అడపా వెంకటసుబ్రహ్మణ్యం, ఆశెట్టి ఆదిబాబు, ముమ్మిడి ప్రతాప్‌కుమార్ షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.



నాగేశ్వరరావుకు మెమెంటో అందజేస్తున్న శ్రీరామచంద్రమూర్తి

అమలాపురం
అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

వినాయకుడి ఆలయాల్లో పూజలు

అంబాజీపేట, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రులు సందర్భంగా మండలంలోని వినాయక ఆలయాలు, ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గణపతి పందిళ్లలో పూజలు నిర్వహించారు. గణపతికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

ఆలయాభివృద్ధికి విరాళం

మామిడికుదురు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని వేంచేసి ఉన్న శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి ఆలయాల అభివృద్ధికి విశ్రాంత లైబ్రేరియన్ నాయినాల నాగేశ్వరరావు రూ.25వేలు విరాళాన్ని అందించారు. దాతను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

టౌన్‌ప్లానింగ్ పనితీరుపై కౌన్సిలర్ల అసంతృప్తి

● నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం


నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం దృశ్యం

ముమ్మిడివరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అనథరైజ్డ్ లేఅవుట్లలో కూడా ప్లాట్లలో భవన నిర్మాణానికి ఎల్టీపీ(లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్స్)లు అనుమతులిస్తున్నారు. వాటికి సంబంధించి కొన్నిటికి టౌన్ ప్లానింగ్ అధికారి షార్ట్‌ఫాల్‌లో ఉంచుతున్నారు. దీంతో ఆ ప్లాట్లలో భవన నిర్మాణాలకు సంబంధించి బ్యాంకు అధికారులు రుణాలు మంజూరులో అభ్యంతరాలు పెడుతున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందని కమిషనర్ పి.రవివర్మ, టీపీవో రాజేష్‌లను కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ నిలదీశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ టౌన్ ప్లానింగ్ విభాగ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారి రాజేష్ మాట్లాడుతూ ఎల్టీపీలు అముడా పరిధిలో పనిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకునే అధికారం అముడాకే ఉందన్నారు. అయితే ఎల్టీపీలు అప్రూవల్ చేసినా లోపాలు ఉన్న వాటిని షార్ట్‌ఫాల్‌లో పెడుతున్నామన్నారు. పొజిషన్ సర్టిఫికెట్ ఉంటేనే రుణాలు మంజూరు కావంటున్నారు, దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్ సత్యశ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సీనియర్ అసిస్టెంట్ మేడిద శ్రీనివాస్ మాట్లాడుతూ జిరాయితీ, గ్రామకంఠం భూములకు సంబంధించి అయితే పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరులో ఎటువంటి ఇబ్బంది లేదని, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడానికి నిబంధనలకు విరుద్ధమన్నారు. వెంచర్లు వేసే కొందరు నేషనల్ హైవేను ఆనుకుని ఉన్న మురుగునీటి, పంట బోదెలను సైతం కప్పి వేస్తున్నారని, దీని వల్ల అధిక వర్షాలు వచ్చినప్పుడు ముంపు సమస్య తలెత్తుతుందని, దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నగర పంచాయతీ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదని ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ కమిషనర్‌ను నిలదీశారు. కమిషనర్ రవివర్మ స్పందించి తమ పరిధిలో ఉన్నంత వరకు చర్యలు తీసుకుంటున్నానని, రెవెన్యూ అధికారులు కూడా చర్యలు తీసుకోవాలని లేఖ రాశానన్నారు. అనథరైజ్డ్ లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు ఎందుకు పెట్టడం లేదని టీపీవో రాజేష్‌ను ప్రశ్నించగా పెడుతున్నామని, అయితే వాటిని లేఅవుట్ల యజమానులు తొలగిస్తున్నారని సంజాయిషీ ఇవ్వగా, అయితే బోర్డులు తొలగిస్తున్న వారిపై ఎందుకు చర్యలు చేపట్టడంలేదని కమిషనర్‌ను బాలకృష్ణ నిలదీశారు. వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ సంజాయిషీ ఇచ్చారు. 17వవార్డులో రెండేళ్ల క్రితం వీధి దీపాల కోసం విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి తీగలు వేసినా ఇప్పటివరకు కనెక్షన్ ఇవ్వలేదని, వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ సమావేశం దృష్టికి తీసుకురాగా చైర్మన్ ప్రవీణ్‌కుమార్ స్పందించి తక్షణం వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఒక మహిళా ప్రజాప్రతినిధి భర్త మహిళా ఉద్యోగినిని వేధిస్తున్నారని, ఒక నిరాధారణమైన వార్తను వైస్‌చైర్‌పర్సన్ సమావేశంలో చర్చకు తీసుకువచ్చి సభా సమయాన్ని వృథా చేయడమే కాకుండా ప్రజా ప్రతినిధిపై నిరాధారమైన ఆరోపణలు చేశారని కౌన్సిలర్ కడలి సౌజన్య సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. చైర్మన్ ప్రవీణ్‌కుమార్ స్పందించి భవిష్యత్తులో వ్యకిగత ఆరోపణలు సమావేశంలో చర్చకు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 4వ వార్డులో డంపింగ్ యార్డులో సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను డంప్ చేస్తున్నారని, దీంతో 6వ వార్డులోని ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడుతూ అనారోగ్యానికి గురవుతున్నారని ఆ వార్డు కౌన్సిలర్ దివి మహాలక్ష్మి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను డంప్ చేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు. కాంపెక్టర్ మరమ్మతుల వల్ల చెత్తను పూర్తిగా తొలగించలేకపోతున్నారని, దీని వల్ల పారిశుధ్య సమస్య తలెత్తుతుందని, వెంటనే కాంపెక్టును మరమ్మతులు చేయించాలని చైర్మన్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. తమ వార్డులో క్లోరినేషన్, బ్లీచింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని దీంతో పారిశుధ్య సమస్య తలెత్తుతుందని, మంచినీటిలో మలినాలు వస్తున్నాయని సోమిదేవరపాలెం కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. 13వ వార్డులో జంగిల్ క్లియరెన్సు చేయించాలని, కాల్వలో చెత్తను తొలగించాలని వార్డు కౌన్సిలర్ కోటుం జయలక్ష్మి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో 31తీర్మానాలు ప్రవేశపెట్టగా సభ్యులు వాటిని తీర్మానించారు. సాధారణ నిధుల నుంచి 1వ పద్దు కింద 2025 జూలై 1నాటికి ప్రారంభ నిల్వ రూ.21,57,727 చూపగా జమలు, ఖర్చులు నిల్ చూపారు. అలాగే రెండో పద్దు కింద సాధారణ నిధుల నుంచి ప్రారంభ నిల్వ జూలై 1నాటికి రూ.56,85,042 చూపగా జమలు, ఖర్చులు నిల్‌గా చూపారు. సమావేశంలో వైస్‌చైర్మన్ వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

గోదావరి తగ్గుతూ...పెరుగుతూ

● లంకల్లో పడవలపైనే రాకపోకలు


అయినవిల్లి: ముక్తేశ్వరం తొగరపాయలో నీట మునిగిన పాత వంతెన

పి.గన్నవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోదావరి తగ్గుతూ పెరుగుతూ లంకగ్రామాల ప్రజలను ఆందోళనకు గురిచేస్తుంది. ఈసీజన్‌లో మూడో సారి గోదావరికి వరదలు రావడంతో నదీపాయలు ఇంకా నిండుగానే ప్రవహిస్తున్నాయి. దీంతో లంక గ్రామస్తులు నానాఅవస్థలు పడుతున్నారు. గోదావరి ఎగువన తగ్గి మళ్లీ పెరగడంతో దిగువన శుక్రవారం రాత్రి కొంత మేర తగ్గి శనివారం మళ్లీ పెరుగుదల మొదలైంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 9,31,541 లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. పి.గన్నవరం మండలంలో చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే నీట మునగడంతో స్థానికులు, విద్యార్థులు, రైతులు మరపడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. నదీపాయ వద్ద అధికారుల పర్యవేక్షణ ఉన్నప్పటికి లైఫ్‌జాకెట్ల విషయంలో అలసత్వం వహించడంపై ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు మండిపడుతున్నారు. అలాగే గంటిపెదపూడి శివారు పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక, పశ్చిమ గోదావరి జిల్లా అనగార్లంక, అయోధ్యలంక, పెదమల్లంక గ్రామస్తులు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అయోధ్యలంక నుంచి లంకలగన్నవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వచ్చే విద్యార్థులు వరద ఉధృతిలో నాటుపడవపై రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు.

గోదావరికి పోటెత్తిన వరద

అయినవిల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరి నది పోటెత్తి ప్రవహిస్తోంది. గౌతమీ, వృద్ధగౌతమీ పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముక్తేశ్వరంలో తొగరపాయపై పాత వంతెన నీట మునిగింది. వరద పోటెత్తుతుండడంతో నదీ తీర ప్రాంతాలైన లంక గ్రామవాసులు అప్రమత్తమయ్యారు. పల్లపులంకలు మునిగే అవకాశాలు ఉండడంతో పశుగ్రాసాలను మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఆర్డీవో..

గోదావరికి వరద పెరుగుతున్న నేపథ్యంలో కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ మండలంలోని అయినవిల్లిలంక, వెదురుబిడియం కాజ్‌వే వద్ద పరిస్థితిని పరిశీలించారు. తొగరపాయ వద్ద వెలువలపల్లి, చింతనలంకలో ఉన్న వినాయక నిమజ్జన పాయింట్లను పరిశీలించారు. వరదలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ సీహెచ్ విద్యాపతి, ఎంపీడీవో సరోవర్, ఎస్‌ఐ హరికోటిశాస్త్రి తదితరులు ఉన్నారు.

అయినవిల్లిలో ఆధ్యాత్మిక శోభ


అయినవిల్లి ఆలయంలో ధూపసేవ

అయినవిల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆధ్యాత్మిక శోభ నెలకొంది. స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామివారికి లక్ష దూర్వార్చన, ధూపసేవ, గ్రామోత్సవం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో క్యూలైన్లు, మండపాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ అల్లు దుర్గాభవానీ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది సేవలు అందించారు. శనివారం అక్షరాభ్యాసం, అన్నప్రాసన, వేదాశీర్వచనం ఒక్కొక్కటి చొప్పున నిర్వహించగా ఐదు తులాభారాలు,ద్విచక్ర వాహనపూజలు 15, అన్నప్రసాదం 8200,పులిహోర 3492, అన్నప్రసాద విరాళం రూ.2.30లక్షలతో కలిపి మొత్తం రూ.5,46,428 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనర్ దుర్గాభవానీ తెలిపారు.

బాలబాలాజీ స్వామి ఆదాయం రూ.2.38 లక్షలు



మామిడికుదురు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,38,498 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. శనివారం అర్చకులు స్వామివారికి వేకువజామునే సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కొత్త, పాత ఆలయాలు కిటకిటలాడాయి. స్వామివారిని శనివారం 3800 మంది భక్తులు దర్శించుకుని దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానంలో 2వేల మంది ప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ప్రైవేటు బస్సులకు జరిమానా

ముమ్మిడివరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద 14 ప్రైవేటు బస్సులపై జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తనిఖీలు నిర్వహించారు. వాహనాల ప్రత్యేక తనిఖీల్లో భాగంగా అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద 14ప్రైవేటు బస్సులపై కేసులు నమోదుచేసి రూ.23వేలు అపరాధ రుసుం విధించినట్టు జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, కౌశిక్ పాల్గొన్నారు.

సెప్టెంబరు 5న ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం


ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాశాఖ అధ్యక్షుడు బాపూజీ

అమలాపురం టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తోన్న ఉద్యోగుల సమస్యలను తెలుసుకునేందుకు సెప్టెంబరు 5న అమలాపురంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు జిల్లాశాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల రామసూర్యనారాయణ హాజరవుతారన్నారు. గొల్లగూడెం బైపాస్ రోడ్డులోని కార్యాలయం వద్ద శనివారం జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం బాపూజీ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 5న అమలాపురం పెన్షనర్స్ భవనంలో ఉద్యోగులారా రండి. టి తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ చేపట్టినట్టు వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై సమస్యలను రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకురావాలని బాపూజీ కోరారు. గుర్తించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి రామసూర్యనారాయణ కృషి చేస్తారని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మల్లిబాబు, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శి వి.శివకుమార్, నాయకులు పి.కామేశ్వరరావు, బి.సుగుణరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఒకేసారి ఐదు పద్యాలు చెప్పిన చిన్నారి



మలికిపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సర్ ఆర్థర్ కాటన్ పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో వేదికపై వై.శ్రీయాన్ ఐదు తెలుగు పద్యాలు ఒకేసారి చదివి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఎల్‌కేజీ చదువుతున్న శ్రీయాన్‌ను పలువురు అభినందించారు.

అంతర్వేది ఆలయానికి మొక్కల పంపిణీ

అంతర్వేది, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సఖినేటిపల్లిలంకకు చెందిన పడాల రమేష్ సహస్ర, శ్రీవిజయదుర్గ క్యాయిర్ ఇండస్ట్రీస్ తరపున మొక్కలు పంపిణీ చేశారు. రూ.లక్ష విలువైన మొక్కలను కడియం నుంచి రప్పించారు. ఆలయ దక్షిణ భాగంలో ఉన్న ప్రధాన గోపురం వద్ద తులసి వనం, ఆలయ బేడ మండపంలో పూల కుండీలతో మొక్కలను ఏర్పాటు చేశారు. ముందుగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి ఆలయంలో దర్శనం కల్పించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ అందించారు. మంచిగంటి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సహిత విద్య ఉపాధ్యాయులకు శిక్షణ


సహిత విద్య ఉపాధ్యాయులకు శిక్షణలో పాల్గొన్న డీఈవో సలీంబాషా

అమలాపురంటౌన్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సహిత విద్య ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్కూలు అసిస్టెంట్ సన్‌షైన్ ఎస్ఎల్డీ పిల్లలను గుర్తించే విధానం, లక్షణాలు, వారికి వివరించే బోధనా పద్ధతులను తెలియచేశారు. జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా ముఖ్య అతిథిగా హాజరై భవిత కేంద్రాల్లో ఎనరోల్మెంట్ పెంచాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన చిన్నపాటి శస్త్రచికిత్సను గుర్తించి వారికి అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మమ్మీ మాట్లాడుతూ బోధనా మెలకువలతో పాటు ఫిజియోథెరపీపై కూడా ఉపాధ్యాయులు తర్ఫీదుపొందాలన్నారు. అందరికీ ఎస్ఆర్కేవీఎం కిట్లు అందేలా చూడాలన్నారు. మండల విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

పెరుగుతోన్న వరద ప్రవాహం

యానాం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): యానాంలో వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువన కురుస్తున వర్షాలు ప్రభావంతో గోదావరికి వరద నీరు పోటెత్తడంతో యానాం జీఎంసీ బాలయోగి వారధి వద్ద వరద ప్రవాహం ఉధృతంగా సాగుతోంది. ధవళేశ్వరం నుంచి వరదనీరు సముద్రంలోకి వదలడంతో యానాం గౌతమి గోదావరి నుంచి వరద సముద్రంలోకి చేరుతోంది. యానాం రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పలు పర్యాటక కట్టడాలు, పర్యాటక కేంద్రాలు వరద ముంపునకు గురయ్యాయి. పరిపాలనాధికారి మునిస్వామి నేతృత్వంలో వరద పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

నేడు డీటీ రాత పరీక్ష

యానాం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న డిప్యూటీ తహశీల్దార్ (డీటి) పోస్టులకు సంబంధించి ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా రాత పరీక్ష నిర్వహించనున్నారు. యానాంలో 1,975మంది ఈపరీక్షకు హాజరుకానున్నారు. రెండు విభాగాల్లో పరీక్ష జరగనుంది. ఉదయం 10నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

ఉపాధ్యాయులకు శిక్షణ

రాజోలు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాజోలు, పొన్నమండ, కడలి కాంప్లెక్సు కేంద్రాల్లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు, సబ్జెక్టు ఉపాధ్యాయులకు, ఫిజికల్ డైరెక్టర్లకు శనివారం క్లస్టర్ కాంప్లెక్సు శిక్షణ తరగతులు నిర్వహించామని రాజోలు ఎంఈవో ఎం.మనోహరం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకాంప్లెక్సు శిక్షణ తరగతులను శిక్షణ పొందిన రిసోర్సుపర్సన్లతో నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె.సరస్వతి, కాంప్లెక్సు సెక్రటరీ డి.సత్యనారాయణ, రిసోర్సు పర్సన్ గటిగంటి శ్రీనివాస్, యు.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా కల్చర్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా దేశంశెట్టి



ఉప్పలగుప్తం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా డెవలప్‌మెంట్ కమిటీ డైరెక్టర్‌గా భీమనపల్లికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ నియమితులయ్యారు. శనివారం రాత్రి ఆయనకు నియామక ఉత్తర్వులందాయి. లక్ష్మీనారాయణ ఉప్పలగుప్తం జడ్పీటీసీగా సేవలందించారు. ప్రస్తుతం టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, కోనసీమ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన భార్య నాగరత్నకుమారి భీమనపల్లి ఎంపీటీసీగా ఉన్నారు.

గాయత్రీ పీఠం ఉత్తరాధికారిగా తేజేశ్వరశర్మ



అమలాపురంరూరల్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన గాయత్రీపీఠం ఉత్తరాధికారిగా అమలాపురానికి చెందిన కారుపర్తి తేజేశ్వరశర్మ నియమితులయ్యారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ దేవబ్రాహ్మణ, దేవాంగ పండిత అర్చక పురోహిత పరిషత్ నియామకాన్ని ప్రకటించింది. పీఠాధిపతిగా చల్లా రామారావు ఉన్నారు. ఉత్తరాధికారిగా నియమితులైన తేజేశ్వరశర్మ దేవీఉపాకులుగా విశేష ప్రాచుర్యం పొందారు. తేజేశ్వరశర్మ నియామకంపై పురోహిత పరిషత్ సభ్యులు హర్షాతిరేకాలు ప్రకటించారు.

ఆక్రమణలో ఉన్న ఇరిగేషన్ స్థలం స్వాధీనం

పి.గన్నవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం గంటిరోడ్‌లో కొన్నాళ్లగా ఆక్రమణలో ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్టు ఇన్‌చార్జి ఇరిగేషన్ డీఈ బి.రవిప్రసాద్‌రాజు తెలిపారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో ఆక్రమణలో ఉన్న స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. స్థలంలో ఉన్న కొబ్బరికాయలను, చెత్తను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. జేఈ బి.రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యనారాయణ, వీఆర్వో శ్రీను పాల్గొన్నారు.

రేపు గొల్లవిల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

ఉప్పలగుప్తం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబరు ఒకటో తేదీన గొల్లవిల్లి నిమ్మకాయల చినరాజప్ప కల్యాణ మండపంలో నల్లా ఇంద్రాణి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. జనసేన నాయకులు ఆకుల సూర్యనారాయణమూర్తి, చిక్కం సూర్యమోహన్, ఆకుల బుజ్జి నిర్వహణలో ఏర్పాటు చేస్తున్న శిబిరంలో నిష్ణాతులైన వైద్యుల పర్యవేక్షణలో అన్ని రకాల క్యాన్సర్, గుండె, పొట్ట సంబంధిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, అన్ని రకాల రక్తపరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. ఉదయం 8నుంచి సాయంత్రం 6గంటల వరకు శిబిరంలో వైద్య సేవలందిస్తారన్నారు.

విశ్రాంత ఈవో సుబ్బారావు మృతి



అల్లవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నానికి చెందిన విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గూడూరి వెంకటసుబ్బారావు(90) శనివారం మృతిచెందారు. ఆయన కుమారుడు, తెలుగు యువత నియోజకవర్గ అధికార ప్రతినిధి గూడూరి పెదబాబును పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ నాయకులు మంతెన సురేష్‌రాజు, పరసా కిరణ్, సొసైటీ అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, బళ్ల సత్యనారాయణ, కడలి విజయ్, జనసేన నాయకులు గునిశెట్టి చినబాబు, నల్లా రాము, పిండి గణపయ్య, కటికిరెడ్డి బాబి సంతాపం తెలిపారు.

రాజోలు గురుకుల బాలికల ప్రతిభ

రాజోలు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఈనెల29న జరిగిన ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజోలు గురుకుల బాలికలు సత్తా చాటారు. సబ్‌జూనియర్ కేటగిరిలో పదో తరగతి చదువుతోన్న పి.స్పందన బంగారు పతకం, 9వ తరగతి విద్యార్థిని యు.షానిక రజత పతకం, సీనియర్ ఎంపీసీ కేటగిరిలో కె.మంజుల కాంస్య పతకం, 7వ తరగతి విద్యార్థినులు టి.కీర్తి, ఎం.అనురాధ, కాంస్య పతకాలు సాధించారు. ఈఐదుగురు బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ లలితకుమారి, వైస్‌ప్రిన్సిపాల్ టి.సునీత, అధ్యాపకులు, పీఈటీ రత్నకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

తూర్పుపాలెంలో చోరీ

మలికిపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం తూర్పుపాలెంలో పట్టపగలే చోరీ జరిగింది. ఇంటికి తాళాలువేసి తిరుమాని నాగరాజు దంపతులు బయటకి వెళ్లారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో దుండగులు ఇంటి తలుపు పగలకొట్టి బీరువాలోని పది కాసుల బంగారం, కొంత నగదు తీసుకువెళ్లినట్టు తెలిసింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ముమ్మిడివరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కొత్తలంక గ్రామానికి చెందిన పత్సమట్ల ఫణివర్మ(55) కనిపించడం లేదని అతని సోదరుడి కుమారుడు నారాయణరాజు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి నుంచి ఆఫ్ హ్యాండ్స్ షర్టు, గ్రీన్ కలర్ లుంగీ వేసుకుని హీరో పల్సర్ మోటారు సైకిల్‌పై వెళ్లి ఇంటికి తిరిగి రాలేదన్నారు. ఎవరికైనా ఆచూకీ లభ్యం కాకపోతే సెల్ 7893010555కు సమాచారం అందించాలన్నారు.

నేత్రదానంతో అంధులకు వెలుగులు

అంబాజీపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేయడం ద్వారా అంధులకు వెలుగులు నింపవచ్చునని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా అంబాజీపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అప్తాలమిక్ అధికారి వి.ప్రభాకర్, సీహెచ్‌వో అప్పారావు పాల్గొన్నారు.

చిన్న సేవలు మరువలేనివి

అంబాజీపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట పీహెచ్‌సీ అభివృద్ధికి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా మేడిద రంగాజానకీప్రసాద్(చిన్న) ఎంతగానో కృషిచేశారని, ఆయన మృతి తీరనిలోటని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైద్యాధికారి కేఎస్ శ్రీనివాసులు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద చిన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీహెచ్‌వో బి.అప్పారావు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డిపో మేనేజర్ మూర్తి సేవలు ప్రశంసనీయం

అమలాపురం రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా చల్లా సత్యనారాయణమూర్తి అందించిన సేవలు ప్రశంసనీయమని విజయవాడ జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయరత్నం అభినందించారు. డిపో మేనేజర్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న సత్యనారాయణమూర్తి దంపతులకు సన్మాన వీడ్కోలు సభ శనివారం డిపో గ్యారేజీలో నిర్వహించారు. వివిధ విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన ఘనత మూర్తికి దక్కుతుందని జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ పేర్కొన్నారు. మూర్తి దంపతులకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. డిపో మేనేజర్లు, డిపో సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రామేశ్వరం మొగ పరిధిలో పంచనదిపై క్రాస్‌బండ్



అల్లవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ శాఖ ఆధ్వర్యంలో వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ పర్యవేక్షణలో కొమరగిరిపట్నం శివారు రామేశ్వరం మొగ తవ్వకాలు జరుగుతున్నందున, పనులు విజయవంతానికి పంచనది డ్రెయిన్‌పై శుక్రవారం నుంచి క్రాస్ బండ్ నిర్మాణ పనులు చేపట్టారు. క్రాస్‌బండ్ ద్వారా సముద్రంలోకి ముంపునీరు దిగేందుకు వీలుగా పంచనది డ్రెయిన్‌పై రామేశ్వరం మొగ పరిధిలో క్రాస్‌బండ్ వేసినట్టు అల్లవరం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దాట్ల గోపీరాజు తెలిపారు.

ఎంపీడీవో ఉద్యోగ విరమణ

ముమ్మిడివరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవలే గుర్తింపు ఇస్తాయని పలువురు పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎంపీడీవోగా శనివారం ఉద్యోగ విరమణ పొందిన తాడి శ్రీవెంకటాచార్యను శనివారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కోలా గంగాభవానీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తాడి శ్రీవెంకటాచార్య దంపతులను పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. టీడీపీ నాయకులు గుత్తుల సాయి, తాడి నరసింహారావు, అర్ధాని శ్రీనివాసరావు, పొద్దోకు నారాయణరావు, గొలకోటి దొరబాబు, గుద్దటి జమ్మి, కోలా బాబ్జి, డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణి, తహశీల్దార్ టి.సుభాష్, కమిషనర్ పి.రవివర్మ పాల్గొన్నారు.

'బాల్య వివాహాలతో అనర్థాలు'

ముమ్మిడివరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం వల్ల విద్యార్థినుల చదువు మధ్యలోనే ఆగిపోవడం, పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్‌సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. ముమ్మిడివరం రాణేలంక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాల్య వివాహాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు జడ్జి మహ్మద్ రహ్మతుల్లా అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థినులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

మలికిపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరాయపురానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు నేదునూరి వెంకటేష్ ప్రమాదవశాత్తూ భవనం పైనుంచి పడిపోవడంతో వెన్నుముక దెబ్బతింది. గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థలు రూ.39వేలు గుబ్బల శ్రీనివాస్ ద్వారా శనివారం అందజేశారు. ఎస్‌ఐ పి.సురేష్, పాటి శివకుమార్, గుబ్బల బాబ్జి పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆలయంలో 'వేద ఆశీర్వచనం'

ఐ.పోలవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వేద ఆశీర్వచనం ద్వారా భక్తులకు భగవంతుని అనుగ్రహం లభిస్తుందని మురమళ్ల వీరేశ్వరాస్వామి ఆలయ ఏసీ వి.సత్యనారాయణ అన్నారు. తద్వారా భక్తులు ఆయురారోగ్యాలతో ఉంటారని అన్నారు. కుటుంబాల సంక్షేమం ఆకాంక్షిస్తూ ఆలయంలో నూతనంగా వేద ఆశీర్వచన సేవ శనివారం నుంచి ప్రారంభించామన్నారు. ఉదయం 8నుంచి 11గంటల వరకు, సాయంత్రం 4నుంచి 5 గంటల వరకు నిర్దేశించిన రుసుం చెల్లించిన భక్తులకు స్వామి దర్శనం, వేద ఆశీర్వచనం అందించి, ప్రసాదం, శేషవస్త్రం అందిస్తామన్నారు.

రేపు అందరికీ పింఛన్లు

మలికిపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో గతంలో ఇచ్చిన అందరికీ పింఛన్లు యథావిధిగా అందజేస్తున్నామని ఎంపీడీవో జి.మల్లికార్జునరావు తెలిపారు. వైద్య బృందాలు తనిఖీల్లో 154 పింఛనుదారులను అనర్హులుగా గుర్తించగా వీటిలో 15పింఛన్లను వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లగా మార్పు చేశారు. మిగిలిన 139మందిలో 138మంది పింఛనుదారులు అప్పీలు చేసుకోగా ఒక వ్యక్తి విదేశంలో ఉన్న కారణంగా అప్పీలు చేసుకోలేదు. అప్పీలు చేసుకున్న వారందరికీ యథావిధిగా సెప్టెంబరు 1న ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం పింఛన్ అందజేస్తామని ఎంపీడీవో తెలిపారు.

అర్హులందరికీ పింఛన్లు

అంతర్వేది, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో 1053 పింఛన్లు ఉన్నాయని ఎంపీడీవో కె.సూర్యనారాయణ తెలిపారు. హెల్త్ పెన్షన్ల నుంచి దివ్యాంగ పెన్షన్లగా మార్పుచేసినవి 10, దివ్యాంగ పెన్షన్ల నుంచి వృద్ధాప్య పెన్షన్లగా మార్పుచేసినవి 21ఉన్నాయన్నారు. మొత్తంగా రద్దు చేయబడినవి 135ఉండగా పెన్షన్లను తనిఖీచేసి 40శాతం కంటే ఎక్కువ అంగ వైకల్యం ఉన్న వారికి నోటీసులు జారీచేసి మండలంలో 1,166మందిలో 691మందికి రీవెరిఫికేషన్ చేశామన్నారు. అందులో 166మందికి 40శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న కారణంగా నోటీసులు జారీ చేశామన్నారు. ఈనెల అందరికీ పెన్షన్లు అందిస్తామని, ఈలోపు వారందరూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య బృందంతో పరీక్షలు చేసి అర్హులైన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు పంపిణీ చేస్తుందన్నారు.

వరదలు.. ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

మామిడికుదురు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగస్తులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ పి.సునీల్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్ సూచించారు. వరద పరిస్థితిపై శనివారం తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇతర ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ధవళేశ్వరంలో వరద మట్టం పెరుగుతుండడంతో అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వహించాలని, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరవాక, ఓడలరేవు, గోగన్నమఠం, బెండమూర్లంక రేవుల్లో పడవల ద్వారా ప్రయాణికుల రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వరద ఉధృతిపై ఆర్డీవో సమీక్ష

ముమ్మిడివరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి ప్రభావం తగ్గేవరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరం మండలం వద్ద ప్రభావిత గ్రామాల పరిస్థితులపై శనివారం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో ప్రాంతాల్లో పర్యటించి ముంపు బాధితులకు భరోసాగా నిలవాలన్నారు. ఎలాంటి సహాయం కావాలన్నా సమస్యను కంట్రోల్ రూము దృష్టికి తీసుకువస్తే సత్వరం స్పందించి సహాయకచర్యలు చేపటడతామని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో తహశీల్దార్ టి.సురేష్, వరద ప్రత్యేకాధికారి పి.గౌతమ్, మండలస్థాయి అధికారులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అంతర్వేది, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు సఖినేటిపల్లికి చెందిన సోమిశెట్టి సందీప్, వారి కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళంగా అందించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

కొనసాగుతున్న గణపతి నవరాత్రులు


పెదపళ్ల గణేష్ ఆలయంలో స్వామివారు

ఆలమూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రాంతాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నాలుగోరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆలమూరు, పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, చింతలూరు, జొన్నాడ, నర్సిపూడి గ్రామాల్లోని గణపతి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. గ్రామాల్లోని ఆయా వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చేసి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

ప్రత్యేక పూజలు

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ఆయా మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాల వద్ద ఉదయం, రాత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

విశాఖకు తరలి వెళ్లిన జన సైనికులు


మండపేట నుంచి విశాఖలో జరిగే జనసేన సభకు వెళుతున్న జన సైనికులు

ఆలమూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తల సమావేశానికి మండలం నుంచి ఆ పార్టీ నాయకులు బస్సులో తరలి వెళ్లారు. శనివారం ఉదయం జొన్నాడ నుంచి వైజాగ్‌కు ప్రయాణమయ్యారు. జనసేన పార్టీ అధినేత ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సారధ్యంలో విశాఖలో కార్యకర్తలతో సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో మండలం నుంచి నాయకులు కొత్తపల్లి నగేష్, సలాది జయప్రకాష్‌నారాయణ, బైరిశెట్టి రాం బాబు, చల్లా బాబి, సిరిగినేటి పట్టాభి, కట్టా రాజు తదితరులు విశాఖకు తరలి వెళ్లారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): విశాఖలో జరుగుతున్న జనసేన సభకు మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి రాష్ట్ర ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ సారధ్యంలో నియోజక వర్గానికి చెందిన జన సైనికులు శనివారం మండపేట నుంచి బస్సు లో విశాఖకు తరలివెళ్లారు. కార్యక్రమంలో జన సైనికులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడిగా రవిచంద్ర


రవిచంద్రను అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడిగా ర్యాలికి చెందిన పాలంగి రవిచంద్రను నియమిస్తూ ఆర్డీవో శ్రీకర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోషల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆర్డీవో చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు ఎంపీడీవోలు, తహశీల్దార్లు, డీఎస్పీతో పాటు ఎన్జీవోల నుంచి మరో నలుగురు సభ్యులను ఎంపిక చేస్తూ ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే బండారును రవిచంద్ర కలుసుకోగా ఆయనను ఎమ్మెల్యే సత్కరించారు.

నాగేంద్రకు ఎమ్మెల్యే పరామర్శ

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన టీడీపీ ప్రధాన కార్యదర్శి గుడేల నాగేంద్ర మాతృమూర్తి సత్యవతి అకస్మికంగా మృతి చెందారు. శనివారం నాగేంద్రను ఎమ్మెల్యేతో పాటు ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పెండెం వెంకన్న తదితర నాయకులు పరామర్శించి సత్యవతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.


ఎమ్మెల్యే వేగుళ్లకు భూమి పత్రాలు అందజేస్తున్న ఉండమట్ల కుటుంబ సభ్యులు

వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూ విరాళం

మండపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కేశవరంలో నిర్మించే వాటర్ ట్యాంకు నిర్మాణానికి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు స్వర్గీయ ఉండమట్ల రామారావు కుటుంబ సభ్యులు రూ.25లక్షల విలువైన 5 సెంట్ల భూమిని వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వేగుళ్లకు భూమి పత్రాలు అందజేశారు. మండపేట పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రామారావు కుమారులు శ్రీనివాస్, రాంబాబుతోపాటు కుటుంబ సభ్యుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా రామారావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్లతోపాటు పలువురు గ్రామస్థులు తదితరులు అభినందించారు.

రాజకీయ నాయకులతో ఆర్డీవో సమీక్ష

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గంలో ఓటర్ల జాబితాపై ఆన్‌లైన్‌లో 1494 క్లెయిములు దాఖలు అయినట్లు ఆర్డీవో దేవరకొండ అఖిల తెలిపారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. క్లెయిముల వివరాలు ఆయా పార్టీలకు అందజేస్తున్నామని బూత్‌లెవెల్ ఏజెంట్లు వీటిపై ఏమైనా అభ్యంతరాలుంటే బీఎల్‌వోలకు తెలియచేయాలని కోరారు. నియోజకవర్గంలో 1,200 మంది ఓటర్లు దాటిన పోలింగ్ స్టేషన్లు 8 గుర్తించినట్లు తెలిపారు. సమావేశంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ పోలింగ్ కేంద్రం 11 మార్పు చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరాజు, రామచంద్రపురం తహసీల్దార్ మృత్యుంజయరావు, కాజులూరు డిప్యూటీ తహసీల్దార్, భారతీయ జనతా పార్టీ, తెలుగుదేశం, వైసీపీ, జనసేన పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.


మండపేటలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ తేజేశ్వరరావు

తహసీల్దార్ సమావేశం

మండపేట, (ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో మండపేట తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ పి.తేజేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన ఆయా పార్టీల నాయకులతో చర్చించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరఫున రాజు, బీజేపీ తరఫున ప్రకాష్, వైసీపీ తరఫున వెంకన్నబాబు, మున్సిపల్ కార్యాలయం టీపీవో రమ్య, రాయవరం తహసీల్దార్ కార్యాలయం నుంచి రిస్పేడీటీ కుమారి, మండల ఎన్నికల డీటీ మోహర్‌బాబా, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిలను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

మండపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు శనివారం విజయవాడలో కలిశారు. ఆయనతోపాటు ఆమెను కలిసిన వారిలో నేషనల్ కోఆర్డినేటర్ నీలం రమేష్, కిసాన్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ సింగం రామకృష్ణారెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌లు రేపాల మోహనరావు, కాకర్ల హరిబాబు, దేవరపల్లి సుబ్బారెడ్డి, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కాంగ్రెస్ నేతలు షర్మిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో నిర్వహించే కిసాన్ సెల్ రాష్ట్ర సమావేశానికి షర్మిలను ఆహ్వానించేందుకు కలిసామని తెలిపారు. కిసాన్ సెల్ రాష్ట్ర సమావేశానికి హాజరు కావాలని కోరినట్టు కామన చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయటంతోపాటు రైతు సమస్యల పరిష్కారానికి పోరాడతామన్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.2.38 లక్షలు

మామిడికుదురు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,38,498 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. శనివారం అర్చకులు స్వామివారికి వేకువజామునే సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కొత్త, పాత ఆలయాలు కిటకిటలాడాయి. స్వామివారిని శనివారం 3800మంది భక్తులు దర్శించుకుని దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానంలో 2వేల మంది ప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.


శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

కొత్తపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,59,800 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్లు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.


కోటిపల్లిలో వాహనదారులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ జానీబాషా

మద్యం సేవించి వాహనం నడిపితే జైలే..

కె.గంగవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే అపరాధ రుసుముతో పాటు, ఏడు రోజులు జైలుశిక్ష పడే అవకాశం ఉందని పామర్రు ఎస్ఐ ఎస్.కె. జానీ బాషా చెప్పారు. శనివారం కోటిపల్లిలో పలు వాహనాలు తనిఖీలు చేశారు. వాహనదారులు మద్యం సేవించారా లేదా అని తనిఖీ చేశారు. ఈ నెలలో 15 మంది నుంచి ఒక్కొక్కరి నుంచి 11,500 చొప్పున అపరాధ రుసుము వసూలు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు శెట్టిబలిజ వర్గీయుల సమావేశం

రాయవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వెంటూరు గ్రామంలో ఆదివారం శెట్టిబలిజ వర్గీయుల సమావేశం ఏర్పాటు చేసినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి మాధవ రావు తెలిపారు. నేటి మధ్యాహ్నం జరిగే ఈ సమావేశానికి ఏపీ శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ కార్పొరేషన్ చైర్మన్ కురుపు సత్తిబాబు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తామన్నారు.

ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు

రావులపాలెం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రికార్డులు సక్రమంగా లేని 19 ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై రవాణాశాఖాధికారులు కేసులు నమోదు చేశారు. ఈతకోట జాతీయ రహదారిపై జిల్లా రవాణాశాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేయగా రికార్డులు సక్రమంగా లేని 19 ప్రైవేట్ ట్రావెల్ బస్సులపై కేసు నమోదు చేసి రూ.61,400 ఫైన్లు విధించారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, లక్ష్మిశ్రీదేవి, షణ్ముఖ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వాడపల్లి ప్రయాణికులతో రద్దీ దృశ్యం

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రద్దీ

రావులపాలెం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భక్తులతో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రద్దీ నెలకొంది. శనివారం తెల్లవారుజాము నుంచే వాడపల్లికి వెళ్లే భక్తులతో కిటకిటలాడింది. వాడపల్లికి వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా డీఎం కుమార్ అన్ని చర్యలు తీసుకున్నారు.

ఎంపీపీ చూపు టీడీపీ వైపు?

మండపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ఎంపీపీ ఉండమట్ల శ్రీనువాసు త్వరలో టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధమవుతున్నట్టు తెలిసింది. వైసీపీలో ఎంపీపీగా ఎన్నికైన వాసు జెంటిల్‌మన్ ఒప్పందం మేరకు రెండున్నరేళ్లపాటు ఆ పదవిలో కొనసాగేలా వైసీపీ పెద్దల సమక్షంలో అప్పట్లో కుదిరిన ఒప్పందం నేటికీ అమలు కాలేదు. రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోవటం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో జెంటిల్‌మన్ ఒప్పందం మరుగున పడిపోయింది. ఒప్పందం మేరకు ఎంపీపీ స్వగ్రామం కేశవరంనకు చెందిన అన్నందేవుల కష్ణకు దక్కాల్సి ఉంది. అయితే ఆ ఒప్పందం ఊసే లేకపోవటంతో ఆయన కూడా చేసేది లేక స్తబ్దతగా ఉండిపోయారు. ఇక రాష్ట్రంలో అధికారం మారటం కూటమి ప్రభుత్వం రావటంతో గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఎంపీపీలు ప్రతిపక్షంగా వున్న టీడీపీ వారి పక్షాన వ్యవహరించిన తీరు ఇప్పుడు రివెంజ్ తీర్చుకుంటుండటంతో ఇక చేసేది లేక ఎంపీపీ టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

స్త్రీశక్తిపై నేడు సమావేశం

మండపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండపేటలో స్త్రీశక్తి కార్యక్రమంపై ఆదివారం సూర్య కన్వెన్షన్ హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్టు టీడీపీ ఒక ప్రకటనలో తెలిపింది. నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ సదస్సుకు అధిక సంఖ్యలో మహిళలు హాజరై దీన్ని విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణులు కోరారు.



ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక బ్యారేజీ వద్ద వరద ఉధృతి. పక్క చిత్రంలో ఆలమూరు మండలం మూలస్థానం వద్ద కాజ్‌వే కొట్టుకుపోవడంతో పడవలపై రాకపోకలు సాగిస్తున్న తోకలంక గ్రామస్తులు

పొంగి ప్రవహిస్తున్న గోదావరి

ఆత్రేయపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన విస్తారంగా కురుస్తున్న వర్షాలకు గోదావరి పొంగి ప్రవహిస్తున్నది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద పోటెత్తింది. శనివారం బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద గౌతమి, వశిష్ట నదులు వరదతో ఉరకలేస్తూ ప్రవహిస్తున్నది. తరచూ వరదలు రావడంతో లంకవాసులు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం సాయంత్రం 5 గంటలకు భద్రాచలం వద్ద 47.5 అడుగులకు వరద నీరు చేరింది. బొబ్బర్లంక బ్యారేజీ వద్ద సాయంత్రానికి 11.4 అడుగులకు వరదనీరు చేరుకోవడంతో దిగువకు 9.31 లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఆలమూరు మండలంలోని ఆయా లంక భూముల్లోకి వరద నీరు చేరింది. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న భూములు మరోసారి ముంపునకు గురయ్యాయి. వరద నీటి ప్రవాహనికి మూలస్థానం వద్ద ఉన్న కాజ్‌వే కొట్టుకుపోవడంతో రావులపాలెం మండలం ఊబలంక పంచాయతీకి చెందిన తోకలంకకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తోకలంక చుట్టూ వరదనీరు ఉండటంతో తొమ్మిది రోజులుగా జలదిగ్బంధంలోనే కొనసాగుతోంది. దీంతో ఆ గ్రామానికి స్థానికులు నాటుపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలోని జొన్నాడ వద్ద పుష్కర్‌ఘాట్‌లోకి మరోసారి వరదనీరు చేరింది. రెండు వంతెనల మధ్య వరద ఉధృతంగా ప్రవహిస్తున్నది.

వినాయక నిమజ్జనానికి పటిష్ట పోలీసు బందోబస్తు

డీఎస్పీ రఘువీర్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో వినాయక నిమజ్జనం సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని డీఎస్పీ రఘువీర్ తెలిపారు. శనివారం రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో 670 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారన్నారు. వినాయక నిమజ్జనం వివరాలు పోలీసు శాఖకు ముందుగా తెలియజేయాలన్నారు. దీన్ని బట్టి ఘాట్లలో తగిన ఏర్పాట్లు చేస్తామని వాటి నిర్వాహకులకు సూచించారు. కె.గంగవరం మండలం, కపిలేశ్వరపురం మండలాల్లో గోదావరి తీర ప్రాంత ఘాట్లలో నిమజ్జనం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వెలుగు ఉండగానే నిమజ్జనం నిర్వహించాలని, రాత్రి సమయాల్లో నిమజ్జనాలు ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు. గత ఏడాదితో పోలిస్తే విగ్రహాలు పెరిగినందున ముందస్తు సమాచారం ఇస్తే కాలువ ఘాట్లు, నదీ ఘాట్ల వద్ద తగినంత భద్రత ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో సీఐ ఎం.వెంకట నారాయణ, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

నిమజ్జనాలపై అప్రమత్తంగా ఉండాలి ఆర్డీవో అఖిల

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రులు ముగింపు తరువాత జరిగే గణేష్ నిమజ్జనం పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల అన్నారు. శనివారం కోటిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఆమె పలు శాఖల అధికారులతో సమావేశం జరిపారు. వచ్చేనెల 5, 6 తేదీల్లో గణేష్ నిమజ్జనాలు జరుగుతాయని కోటిపల్లి గోదావరికి సుమారు 200 విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నట్టు అంచనా వేస్తున్నామని తెలిపారు. రేవులో విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తకుండా చూడాలన్నారు. నిమజ్జనం నాడు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ తెలిపారు. అనంతరం కోటిపల్లి రేవులో వరద ఉధృతిని పరిశీలించారు. నిమజ్జనం ఏర్పాట్లు ఆర్డీవో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ మురళి, విద్యుత్‌శాఖ ఏఈ భాస్కర్, కూటమి నాయకులు పెమ్మాడి సత్తిబాబు, చీకట్ల సోమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

కమిటీలకు ఆర్డీవో సూచనలు

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రుల అనంతరం జరిగే నిమజ్జనం కార్యక్రమాలపై ఆయా కమిటీలకు ఆర్డీవో శ్రీకర్ పలు సూచనలు చేశారు. నిమజ్జనానికి సంబంధించిన పలు రేవులను శనివారం పరిశీలించారు. మండలంలోని అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.


మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్

కార్యక్రమంలో తహశీల్దారు వై.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పుష్కర ఘాట్లు పరిశీలన

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనాల నేపథ్యంలో నదీపరివాహక ప్రాంతాలైన కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి పుష్కర ఘాట్లను శనివారం తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, ఎస్ఐ హరీష్‌కుమార్ పరిశీలించారు. పుష్కరఘాట్ల వద్ద చేపట్టాల్సిన వసతులు, తీసుకోవల్సిన జాగ్రత్తలు తదితర పలు అంశాలపై కార్యదర్శులకు, ఆయా శాఖల అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కె.గంగవరం మండలం కోటిపల్లి గోదావరి వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల. పక్క చిత్రంలో కొత్తపేట మండలం వానపల్లి పళ్లాలమ్మ ఆలయం వద్ద ఉన్న పాంచాలరేవును పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా నిమజ్జనాలు జరగాలి

కపిలేశ్వరపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గౌతమి గోదావరి నదిలో నిర్వహించే గణేష్ నిమజ్జనాలను అవాంఛనీయ ఘటనలు తావులేకుండా జరపాలని తహసీల్దార్ జి.శ్రీనివాస్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, ఎస్ఐ హరీష్ కుమార్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ పలు అంశాలపై మాట్లాడారు. గోదావరి వరద ఉధృతి కారణంగా ఈ ఘాట్ల వద్ద భారీకేడ్లు, ఇంజన్‌బోట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా రెవెన్యూ, పోలీస్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు శివచక్రవర్తి, కామేశ్వరరావు, విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు, ఆర్ఐ అర్జమ్మ, వీఆర్వోలు వి.రామకృష్ణ, సాకా సత్యనారాయణ, పి.సత్తిబాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వక్తలు

అగ్నిమాపక కేంద్రం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

మండపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండపేట మండలం మారేడుబాకలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించే అగ్నిమాపక కేంద్రం, ప్రహరీ పనులకు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోవింద రాజు, ఎంపీపీ ఉండమట్ల శ్రీనువాస్, మాజీ సర్పంచ్ ఎన్.వీర్రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మచ్చా నాగు, మాజీ ఎంపీటీసీ పసలపూడి శ్రీను, గంగారావు, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

విలువిద్య పోటీల్లో బంగారు పతకం

ఆత్రేయపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్ షిప్ రాష్ట్రస్థాయి విలువిద్య కాంపిటీషన్ పోటీలు తిరుపతిలో ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగాయి. ఆత్రేయపురం మండలం అంకంపాలానికి చెందిన కుదప ప్రజ్ఞుమ్న రాజమహేంద్రవరం రూరల్ హైస్కూల్‌లో చదువుతున్నాడు. అండర్-22 విభాగంలో బంగారు పతకం, నగదు బహుమతి సాధించాడు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, సాప్ చైర్మన్ రవినాయుడు నుంచి బంగారు పతకం, నగదు బహుమతి అందుకున్నాడు. అంకంపాలానికి చెందిన కుదప కార్తికేయ కృష్ణ డెహ్రాడూన్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. అంకంపాలానికి చెందిన వీరిని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, కుదప కృష్ణమూర్తి, సర్పంచ్ ఎం.రాజు, ఉపసర్పంచ్ కరుటూరి విశ్వేశ్వరి తదితరులు విద్యార్థులు అభినందించారు.


అంకంపాలానికి చెందిన విద్యార్థి ప్రజ్ఞుమ్నను అభినందిస్తున్న దృశ్యం


పాఠశాలకు ఇన్వర్టర్ అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు రామ్మోహన్‌రావు

పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత

కె.గంగవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పామర్రు ఉన్నత పాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయుడు చిట్టూరి రామ్మోహన్‌రావు ఇన్వర్టర్‌తో పాటు బ్యాటరీని విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ తాను గతంలో ఈ పాఠశాలలో పనిచేశానని పాఠశాల అభివృద్ధికి సహకారం అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు ఎర్ర ఈశ్వరుడు, సిఆర్‌పి నాగరత్నం, ఉపాధ్యాయులు చుండ్రు చౌదరి, కందుల శ్రీనివాస్, విజయకుమార్, గోపాలకృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణికి రక్తదానం

కొత్తపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కొత్తపేట స్వామి వివేకానంద యోగాశ్రమం నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గర్భిణికి విద్యార్థులతో రక్తదానం చేయించారు. రావులపాలెం మండలం దేవరపల్లికి చెందిన బుడితి లక్ష్మిప్రసన్న సర్జరీకి బ్లడ్ అవసరం కాగా యోగాశ్రమాన్ని ఆశ్రయించగా విద్యార్థి దొమ్మేటి సతీష్, దంగేటి కరుణ కుమార్ అమలాపురం వెళ్లి రక్తదానం చేశారు. ఆమె ఆపరేషన్ పూర్తి అయ్యిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాలు పెట్టుకుని చదువుకోవాలి

కె.గంగవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు పట్టుదలతో చదువుకోవాలని తెలంగాణ సమగ్రశిక్షా జేడీ బి.వెంకట లక్ష్మీ నరసమ్మ అన్నారు. శనివారం ఆమె కోటిపల్లిలో ఒక ఫంక్షన్‌కు హాజరైన ఆమె పాఠశాలను సందర్శించి విద్యార్థులతో పలు అంశాలపై ముచ్చటించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఆమె సొంత ఖర్చులతో విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్‌బీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.